Crime Mirror
QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
26-12-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక:44


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# మాది పేదల ప్రభుత్వం



- మెదక్ చర్చి క్రిస్మస్ వేడుకల్లో సిఎం రేవంత్
- వనదుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు
- క్రైస్తవ మిషనరీల స్ఫూర్తితో పేదలకు విద్య, వైద్యం
- మెదక్ చర్చితో నాకు విడదీయరాని అనుబంధం
- గతంలో పీసీసీ అధ్యక్షుడిగా వచ్చినప్పుడే..
- ముఖ్యమంత్రి హెూదాలో మళ్లీ వస్తానని మొక్కుకున్నా
- సంక్షేమంలో దళిత, గిరిజన క్రైస్తవులకు ప్రాధాన్యం
- మెదక్ చర్చిలో క్రిస్మస్ సంబరాల్లో సీఎం రేవంత్

వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు.




## శ్రీతేజ్ కుటుంబానికి పుష్ప టీమ్

# రూ.2 కోట్ల సాయం

- ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు చెక్కుల అందజేత
- మెరుగు పడుతున్న శ్రీతేజ్ ఆరోగ్యం
- వెంటిలేటర్, ఆక్సిజన్ లేకుండా శ్వాస
- నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో
- సమావేశం కానున్న సినీ ప్రముఖులు
- చిరంజీవి, అల్లు అరవింద్, నాగవంశీ,
- సురేశ్‌బాబు తదితరులు పాల్గొనే అవకాశం!
- సినీ పరిశ్రమ సమస్యలపై చర్చించే చాన్స్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ. 2కోట్ల సాయం అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన ఈ మేరకు తన నిర్ణయాన్ని ప్రకటించారు. నటుడు అల్లు అర్జున్ తరఫున రూ.కోటి.. పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ. 50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు అల్లు అరవింద్ అందజేశారు. దిల్ రాజు, పుష్ప 2 నిర్మాత రవిశంకర్‌తో కలిసి అల్లు అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు.

## ప్రజాపాలన భేష్!

హామీలన్నీ అమలు చేసే దిశగా సాగుతున్న తెలంగాణ సర్కారు
రవాణా, బీసీ సంక్షేమశాఖ కార్యక్రమాలకు ప్రత్యేక అభినందనలు: రాహుల్
మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లేఖ

2లో



## ఆయన ఆదేశాలతోనే నిధుల మళ్లింపు

- సీనియర్ ఐఏఎస్ దానకిశోర్ వాంగ్మూలం!
- ఫార్ములా-ఈ రేసు కేసులో కీలక పరిణామం
- నాలుగు గంటల పాటు ప్రశ్నించిన ఏసీబీ
- పలు అంశాలకు సంబంధించి ఆధారాల సేకరణ
- అరెస్టు వద్దంటూ ప్రభుత్వానికి అర్వింద్ వినతులు
- అప్రూవర్‌గా మార్చుకునే యోచనలో ఏసీబీ
- ఆయన విచారణ తర్వాత కేటీఆర్‌కు నోటీసులు
- కోర్టు తదుపరి ఉత్తర్వుల అనంతరమే?

2లో


## ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు

బతికినన్ని రోజులు అంబేడ్కర్‌ను అవమానించిన కాంగ్రెస్
వాజ్‌పేయ్ శతజయంతి వేడుకల్లో కిషన్ రెడ్డి, బండి



## తప్పుగా మాట్లాడలేదు

- అంబేడ్కర్‌పై నా వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించింది
- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటన
- జేపీ నడ్డా నివాసంలో ఎన్డీఏ నేతల భేటీ
- కూటమిలో మరింత సమన్వయంపై చర్చలు
- పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



న్యూఢిల్లీ,డిసెంబర్25(ఆర్ఎన్ఎ): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని మోడీని సీఎం కోరినట్టు తెలిసింది. గత ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పోలవరం ప్రాజెక్టు పనుల్లో పురోగతిని చంద్రబాబు వివరించినట్టు సమాచారం. దాదాపు గంటకు పైగా ప్రధానితో చంద్రబాబు సమావేశం కొనసాగింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో ఏపీ సీఎం చంద్రబాబు సమావేశంలో పలు అంశాలు చర్చించారని సమచారం. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై భేటీలో చర్చించినట్టు సమాచారం.

## అంబేడ్కర్ కృషిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు

- అంబేడ్కర్ కృషిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు
- జల సంరక్షణ ప్రాధాన్యతను సైతం పక్కనపెట్టాయి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం
- మధ్యప్రదేశ్‌లో కెన-బెత్వా
- అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన
- వాజ్‌పేయి స్మారక పోస్టల్ స్టాంప్, నాణెం విడుదల

దేశంలో జల వనరుల అభివృద్ధికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చేసిన కృషిని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. 21వ శతాబ్దంలో తగినన్ని జల వనరులతోపాటు వాటి నిర్వహణలో మెరుగ్గా ఉన్న దేశాలే ప్రగతి పథంలో ముందుకు సాగుతాయని స్పష్టంచేశారు. 21వ శతాబ్దంలో నీటి సంరక్షణే అతిపెద్ద సవాలు అని తేల్చిచెప్పారు

2లో







# తప్పుగా మాట్లాడలేదు

(మొదటి పేజీ తరువాయి)

వాజపేయి శత జయంతి సందర్భంగా బుధవారమిక్కడ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన ఆయన నివాసంలో జరిగిన ఎన్డీయే నేతల భేటీలో అమిత్ షా మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు, కేంద్ర మంత్రులు కుమారస్వామి(జేడీఎస్), జితిన్ మాంఝీ(హెచ్ఏఎం) లలన్‌సింగ్(జేడీయూ), అనుప్రియా పటేల్(అప్నాదళ్%-%ఎస్), పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ), ఆర్ఎల్ఎం అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహా తదితరులు పాల్గొన్నారు. ఇటీవలి పార్లమెంటు సమావేశాలు, రాజ్యాంగంపై జరిగిన చర్చ, అంబేద్కర్ అంశం, సుపరిపాలన, రాజకీయ వ్యూహాలపై చర్చించారు. పార్లమెంటు లోపల, బయట మరింత సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. అంబేద్కర్‌పై తన వ్యాఖ్యలను కాంగ్రెస్ వివాదం చేస్తోందని షా నేతలతో అన్నారు. వాజపేయి జయంతిని పురస్కరించుకుని సమావేశాలు ఏర్పాటుచేసి ఆయన వారసత్వాన్ని స్మరించుకోవాలని ఎన్డీయే నిర్ణయించింది. సమావేశంపై నడ్డా 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అపూర్వ మైలురాళ్లను చేరుకుంటూ ప్రపంచ సూపర్ పవర్‌గా తనను తాను నిలబెట్టుకుందన్నారు.


**10వేల పీఏసీలను ప్రారంభించిన షా**

అమిత్‌షా 10వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీల)తో పాటు పాడి మత్స్య సహకార సంఘాలను ప్రారంభించారు. రానున్న ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 2 లక్షల పీఏసీలను ప్రారంభించే యోచనలో కేంద్రం ఉందని ఆయన తెలిపారు. సహకార సంఘాలలోని రైతులకు రూపే కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు మైక్రో ఏటీఎమ్‌లను పంపిణీ చేశారు. ప్రతి సహకార సంఘానికి ఒక మైక్రో ఏటీఎమ్‌ను సమకూరుస్తామన్నారు.

# ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. అంబేద్కర్ బతికినన్ని రోజులు ఆయన్ను కాంగ్రెస్ అవమానించిందని అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసిన అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఓడించిందని తెలిపారు. మంత్రిగా ఉన్న అంబేద్కర్‌తో నెహ్రూ రాజీనామా చేయించారని పేర్కొన్నారు.954 నుంచి 88 వరకు నెహ్రూ, ఇందిరాగాంధీ సహా 21 మందికి కాంగ్రెస్ భారతరత్న ఇచ్చిందని.. కానీ అంబేద్కర్‌ను ఎందుకు విసర్మించిందో సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో అంబేద్కర్ ఫొటో కూడా ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. దేశ ప్రజల స్ఫూర్తి ప్రదాత వాజ్‌పేయీ అని.. భారత దేశ వైభవాన్ని, నైతిక విలువలకు ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. ఆయన ఎప్పుడూ పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పనిచేశారని చెప్పారు.

# మాది పేదల ప్రభుత్వం



**మెదక్,(క్రైమ్ మిర్రర్):** వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చానని.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చానని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లలో దళిత, గిరిజన క్రైస్తవులకు అత్యధికంగా లబ్ది చేకూరుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10లక్షలకు పెంచామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం వివరించారు. మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏసు భక్తులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. వందేళ్లు పూర్తి చేసుకున్న మెదక్ చర్చి గొప్ప దేవాలయంగా గుర్తింపు పొందిందని తెలిపారు. చారిత్రక చర్చి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. అలాగే మెదక్ చర్చితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తుచేశారు. శతాబ్ది ఉత్సవాలు, భక్తులతో క్రిస్మస్ జరుపుకోవాలనే ఇక్కడకు వచ్చానని తెలిపారు. తమది పేదల ప్రభుత్వమని.. పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో దళితులు, గిరిజనులకు మేలు జరుగుతోందన్నారు. మెదక్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు పొంగులేటి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ పాల్గొన్నారు.కాగా.. మెదక్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ రఘునందన్ రావు తదితరులు వన దుర్గాదేవిని దర్శించుకున్నారు. ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మెదక్ చేరుకున్న సీఎం రేవంత్.. అక్కడ ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మెదక్ చర్చికి చేరుకున్నారు. అక్కడ చర్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆపై అక్కడ నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.

# ఆయన ఆదేశాలతోనే నిధుల మళ్లింపు

హైదరాబాద్, : ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చిన ఐఏఎస్ అధికారి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. ఏసీబీకి చెందిన సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) బృందం దానకిశోర్ నుంచి కీలక ఆధారాలు సేకరించింది. రేసుకు సంబంధించి నాటి ప్రభుత్వానికి, బ్రిటన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు మధ్య జరిగిన ఒప్పందాలు, ఇన్‌వాయిసలు, 2023 సెప్టెంబరు 27న నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద‌కుమార్ నాటి మంత్రి కేటీఆర్‌కు పంపిన ఫైల్ ప్రతులను ఏసీబీ అధికారులు తీసుకున్నారు. దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి అంశానికి సంబంధించిన ఆధారాలనూ సేకరించారు.

మంగళవారం సాయంత్రం దాదాపు నాలుగు గ ంటల పాటు దానకిశోర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం తమకు అందుబాటులో ఉన్న ఫైళ్ల ప్రకారం నిధుల మళ్లింపు అంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. దీనికి కర్త, కర్మ, క్రియ అంతా నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆరేనని దానకిషోర్ స్పష్టం చేసినట్లు సమాచారం. నోట్ ఫైల్ తర్వాత ఒప్పందం జరగడానికి నెలపైగానే సమయం పడితే, అంతకుముందే నిధులు విడుదల చేయడం పూర్తిగా నిబంధనల ఉల్లంఘనేనని, అనుమానాస్పద వ్యవహారమని ఆయన పేర్కొన్నట్లు



తెలుస్తోంది. ఎఫ్ఈవోకు, పురపాలక శాఖకు మధ్య గత ఏడాది అక్టోబరు 30న ఒప్పందం జరగ్గా.. అక్టోబరు3, 11వ తేదీల్లోనే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి రూ.46 కోట్లను ఎఫ్ఈవోకు పంపడంపై ఏసీబీ అధికారులు స్పష్టత తీసుకున్నట్లు సమాచారం.

**సీఎసను పరిగణనలోకి తీసుకోకుండానే..**

ఏ శాఖకు సంబంధించి అయినా నాన్ బడ్జెట్ నిధులు వాడాలంటే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం ఇచ్చి ఫైళ్లను ఆర్థిక శాఖకు పంపాల్సి ఉంటుందని, సీఎం లేదా సంబంధిత మంత్రి ఆమోదిస్తేనే ఇది సాధ్యం అవుతుందని, కేటీఆర్ ఆదేశాల మేరకే తాను నిధులను పంపానని అర్వింద‌కుమార్ అంగీకరించిన విషయాన్ని దానకిశోర్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అర్వింద‌కుమార్ అప్పట్లో పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉండడంతో సీఎసని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఫైళ్లను నడిపించారని తెలుస్తోంది. గత ఏడాది జనవరిలో శాంతికుమారి సీఎసగా నియమితులైనప్పటికీ పురపాలకశాఖ ఫైళ్లు ఆమె వద్దకు రాకుండానే పరుగులు తీసేవని సమాచారం. ఈ క్రమంలో అర్వింద‌కుమార్‌ను విచారించిన తర్వాతే కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఒకటిరెండు రోజుల్లో అర్వింద‌కుమార్‌కు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే హైకోర్టు కేటీఆర్‌కు ఇచ్చిన గడువు ఈ నెల 30నముగుస్తుండడంతో ఆ తర్వాతే నోటీసులకు వెళ్లాలా? అని కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ కేసు నుంచి తనను బయటపడేయాలని, అరెస్టు వరకు వెళ్లకుండా చూడాలని అర్వింద‌కుమార్ ప్రభుత్వానికి సందేశాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను అప్రూవర్‌గా మార్చుకొని దర్యాప్తులో ముందుకు వెళ్లే యోచన కూడా చేస్తున్నట్లు సమాచారం. హైకోర్టు గడువు కొద్ది రోజులే ఉన్న క్రమంలో కేటీఆర్‌కు ముందే నోటీసులు ఇవ్వడం వల్ల ఎక్కువ ప్రచారం వచ్చే అవకాశం ఉంటుందని, కోర్టు తదుపరి ఉత్తర్వుల వరకు ఆగి, ముందుకు వెళ్లడం మంచిదని రాజకీయ వర్గాలు ప్రభుత్వానికి సూచించినట్లు తెలుస్తోంది.

# ముసురుకున్న మేఘాలు!

- కొన్నిచోట్ల ముసురు.. చాలాచోట్ల చిరుజల్లులు
- అక్కడక్కడ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- నేడు, రేపు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, : రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో ఆకాశం నలువైపులా మేఘాలు ముసురుకోవడంతో పగలంతా చల్లబడింది. కొన్నిచోట్ల ముసురు పడగా.. చాలాచోట్ల చిరుజల్లులు కురిశాయి. దీంతో అక్కడక్కడ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. బుధవారం ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోనూ అక్కడక్కడ వానలు కురిశాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో అత్యధికంగా 3.3, మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో 2.1 ములుగు జిల్లా తాడ్వాయిలో 1.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం రాత్రి నుంచే ముసురు పడుతోంది. డోర్నకల్, చిన్నగూడూరు మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా వేసి 15 రోజులు అవుతున్నప్పటికీ లారీలు రాకపోవడంతో తరలించలేదు. దీంతో కొన్ని బస్తాలు తడిసిపోయాయి. భూపాలపల్లి జిల్లాలో ఇంకా 50 వేల టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గుతోంది. వర్షాలు పడుతుండటంతో సరిపడా టార్పాలిన్ కవర్లు లేక ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కొన్ని చోట్ల చేలల్లో పత్తి తడవడంతో ధర తగ్గే అవకాశముందని రైతులు వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు, యాచారం, మొయినాబాద్, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తుంపర్ల వర్షం పడింది. వికారాబాద్ జిల్లాలో వర్షం లేనప్పటికీ వాతావరణం చల్లబడింది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్, పోచారం మునిసిపాలిటీల పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. ఇక గురు, శుక్రవారాల్లో కూడా ఆకాశం మేఘావృతమై ఉంటుందని.. కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నల్లగొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, గద్వాల, యాదాద్రి భువనగిరి, జనగామ, మంచిర్యాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు 16%-%21 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది.

# రూ.2 కోట్ల సాయం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీతేజ్‌ను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలుడు తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. అనంతరం అల్లు అరవింద్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. 'శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడని, వెంటిలేషన్ తీసేశారని,. బాలుడు త్వరలోనే మనందరి మధ్య తిరుగుతాడని ఆశిస్తున్నానని అన్నారు. న్యాయపరమైన అంశాల కారణంగా బాధిత కుటుంబ సభ్యులను కలవలేకపోతున్నా. అన్ని రకాల అనుమతులు తీసుకుని శ్రీతేజ్‌ను 10 రోజుల క్రితం పరామర్శించా. ఆ సమయంలో వెంటిలేషన్‌పై ఉన్నాడని అల్లు అరవింద్ తెలిపారు. 'నిన్నటికి, ఈరోజుకి బాలుడి ఆరోగ్యం కాస్త మెరుగు పడింది. అతడి హెల్త్ కండిషన్ బాగుందని వైద్యులు తెలిపారు. బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్, 'పుష్ప 2' నిర్మాతలు, దర్శకుడు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ అడిగాం. సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తాం. హీరోలు, దర్శకులు, నిర్మాతలం కలిసి వెళ్తాం. గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని దిల్ రాజు తెలిపారు.ఎఫ్‌డీసీ ఛైర్మన్ అయినందుకు సీఎంను కలుస్తున్నారా? ప్రభుత్వం, సినీ పరిశ్రమ మధ్య చోటుచేసుకున్న పరిణామాల గురించి వెళ్తున్నారా? అని దిల్ రాజును మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. తాను చిత్ర పరిశ్రమ వ్యక్తినని, ఇండస్ట్రీ-ప్రభుత్వం మధ్య వారధిగా ఉండాలని సీఎం బాధ్యత ఇచ్చారని, అదే చేస్తున్నానన్నారు. అల్లు అర్జున్‌ను కలిశారా అని అడగ్గా ఇంకా లేదని, త్వరలోనే కలుస్తానని చెప్పారు. **మిగతా 2వ పేజీలో...** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టాలీవుడ్ సినీ ప్రముఖులు సమావేశానికి అపాయింట్‌మెంట్ ఖరారు అయింది. గురువారం ఉదయం 10.00 గంటలకు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ ప్రముఖులు సమావేశం కానున్నారు. టాలీవుడ్ నుంచి మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజుతోపాటు పలువురు నిర్మాతలు, దర్శకులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.ఇక ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహా తదితరులు ఈ సమావేశంలో పాల్గొనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా సినిమా పరిశ్రమల సమస్యలే ఎజెండాపైనే చర్చ జరగనుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. కానీ అల్లు అర్జున్ ఎపిసోడ్ నేపథ్యంలో రేపటి భేటీపై తీవ్ర ఆసక్తి నెలకొంది.అల్లు అర్జున్, రష్మిక జంటగా నటించిన పుష్ప 2 డిసెంబర్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది.

# ప్రజాపాలన భేష్!

హైదరాబాద్, :): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని గ్యారెంటీలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వానికి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. ప్రజాపాలన అద్భుతంగా కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజాప్రభుత్వం ముందుకెళ్తున్న తీరు అభినందనీయమన్నారు. అలాగే రవాణా, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ ఆకాంక్షలను సాకారం చేసే దిశగా ప్రజాప్రతినిధులందరూ నిరంతరం కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాహుల్ లేఖ రాశారు. ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఇందిరమ్మ రాజ్యంలో, రాహుల్ మార్గదర్శకత్వంలో మరింత ముందుకు వెళతామంటూ ఇటీవల రాహుల్‌కుపొన్నం లేఖ రాశారు. ఆ లేఖకు స్పందనగా రాహుల్ మంత్రికి లేఖ రాసి, అభినందనలు తెలిపారు.

# అంబేడ్కర్ కృషిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాం

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం మధ్యప్రదేశ్‌లో కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఖజురహోలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. అంబేద్కర్ అందించిన సేవలను కొనియాడారు. మన దేశంలో జల వనరుల బలోపేతానికి, నిర్వహణకు, డ్యామ్‌ల నిర్మాణానికి అంబేద్కర్ దార్శనికత, దూరదృష్టి ఎంతగానో దోహదపడ్డాయని తెలిపారు. కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ఏర్పాటు వెనుక అంబేద్కర్ కృషి ఉందన్నారు. అతిపెద్ద నదీ లోయ ప్రాజెక్టుల అభివృద్ధికి ఎంతగానో శ్రమించారని పేర్కొన్నారు. జల సంరక్షకుడు అంబేద్కర్‌ను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. జల సంరక్షణ ప్రాధాన్యతను సైతం పక్కనపెట్టాయని విమర్శించారు. ఈ సందర్భంగా దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా ప్రత్యేక స్మారక పోస్టల్ స్టాంప్, రూ.100 నాణాన్ని మోదీ విడుదల చేశారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా 1,153 అటల్ గ్రామ్ సేవా సదనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.437 కోట్లతో ఈ సదనాలు నిర్మిస్తారు. నేడు సుపరిపాలన దినోత్సవం జరుపుకుంటున్నామని ప్రధానమంత్రి చెప్పారు.

**కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్వాకంతో ప్రాజెక్టులు ఆలస్యం**

మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లాలో ఓంకారేశ్వర్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. నదుల అనుసంధానంలో భాగంగా దౌధన్ సాగునీటి ప్రాజెక్టుకు సైతం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కెన్%-%బెత్వా నదుల నీటిని నింపిన రెండు కలశాలను ప్రధాని మోదీకి అందజేశారు. రెండు నదుల అనుసంధాన ప్రాజెక్టు నమూనా(మోడల్)లో మోదీ ఈ నీటిని ధారగా పోశారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని లాంఛనంగా ఆరంభించారు. కెన్-బెత్వా నదుల అనుసంధానంతో బుందేల్‌ఖండ్ ప్రాంతంలో సౌభాగ్యం, సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయని మోదీ ఉద్ఘాటించారు. రూ.44,605 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. దీంతో మధ్యప్రదేశ్‌లో 44 లక్షల మందికి, ఉత్తరప్రదేశ్‌లో 21 లక్షల మందికి తాగునీరు లభించనుంది. 2,000 గ్రామాల్లో 7.18 లక్షల వ్యవసాయ కుటుంబాలు లబ్ధి పొందుతాయి. అలాగే 103 మెగావాట్ల హైడ్రోపవర్, 27 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి జరుగుతుంది.




## ఏసుక్రీస్తు మార్గంలో పయనించాలి : జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట, (క్రైమ్ మిర్రర్):** ఏసుక్రీస్తు చూపిన మార్గంలో అందరూ పయనించి ప్రేమ, కరుణ ఇతరుల పట్ల చూపించాలని, అందరి ప్రార్థనలు ఫలించి ప్రశాంతంగా జీవించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నిర్మల మాతా చర్చ్, సిల్వి సిలోయం చర్చ్, గ్రేస్ చర్చ్, మన్నా చర్చ్, సెయింట్ బాప్టిస్ట్ చర్చిలలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని మతాల ప్రధాన పండగలను అధికారికంగా నిర్వహిస్తూ వాటి ప్రాధాన్యత పెంచిన ఘనత కేసీఆర్‌దే అని స్పష్టం చేశారు. గత పదేండ్లుగా ఆయా మతాల ప్రధాన పండుగలను అధికారికంగా నిర్వహించుకుంటూ మరింత ఐక్యతను పెంచుకున్నామన్నారు. క్రిస్మస్, రంజాన్, దసరా పండుగలకు ప్రత్యేక విందులు, దుస్తులు, సామాగ్రిని పంచుతూ గంగా, జమున, తహజీబ్‌లకు నిలయంగా తెలంగాణ సమాజాన్ని తయారు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని మతాల ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండి తెలంగాణ సమాజం మరింత అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమల్ల అన్నపూర్ణ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, నాయకులు సంద్యాల దయాకర్ రెడ్డి, ఉప్పల ఆనంద్, మారుపెద్ది శ్రీనివాస్ గౌడ్, నెమ్మది బిక్షం, జీడీ భిక్షం, తూడి నరసింహారావు, పూర్ణ శశికాంత్, తాహెర్ పాషా, బత్తుల జానీ, గండూరి కృపాకర్‌లతో పాటు ఆయా చర్చిల పాస్టర్లు, ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మెదక్ చర్చిలో శతాబ్ది ఉత్సవాలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ దైవ వాక్యాన్ని అందించారు. వందేండ్ల మహా దేవాలయంలో ప్రతిష్ట మహోత్సవం జరుపుకుంటున్నందుకు అందరం ధన్యులమని తెలిపారు. దివ్యమైన ఈ మహా దేవాలయంలో 1924 డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకలు జరిగాయని చెప్పారు. తాజాగా వందేండ్ల వేడుకలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అందరం భాగస్వామ్యులు అయినందుకు ధన్యులమని అన్నారు. ఆసియా ఖండంలోని అతి పెద్దదైన రెండో చారిత్రాత్మక దేవాలయంలో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ తెలిపారు. మన జీవితంలో ఇది ఒక ఒక మైలు రాయి అని పేర్కొన్నారు. జ్ఞానులు ఏసుక్రీస్తు అనుసరించిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. లోక రక్షకుడిగా నన్ను రక్షించడానికి ఏసు వచ్చాడు.. సమస్త మానవాళికి ఏసుప్రభువు ఆశీస్సులు ఉండాలని అన్నారు. 'బెత్లెహెంలో దావీదు వంశంలో ఏసు జన్మించాడు. ఏసును కలిగిన బిడ్డలు నిస్వార్థంగా ఆలోచించాలి. స్వార్థ లోకంలో ప్రతిది నాది అనే ఆలోచనతో ఉంటున్నారు. ప్రతి ఒక్కరు స్వార్థమైన ప్రార్థనలు చేయాలి. స్వార్థం మరియమ్మలో లేదు. ప్రతి ఒక్కరూ నిస్వార్థంగా ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ బతకాలి.' అని సూచించారు.
తనపై అక్రమంగా కేసు పెట్టి జైలుకు పంపారు

## పైశాచిక ఆనందం పొందుతున్న రేవంత్ : నరేందర్‌రెడ్డి



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కావాలనే సీఎం రేవంత్‌రెడ్డి తనపై అక్రమంగా కేసు పెట్టి జైలుకు పంపించారని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి విమర్శించారు. లగచర్ల దాడి ఘటనలో తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని మండిపడ్డారు. 37 రోజులు జైల్లో పెట్టి రేవంత్ రెడ్డి పైశాచిక ఆనందం పొందారని అన్నారు. లగచర్ల ఘటనలో కేటీఆర్‌ను కూడా ఇరికించే ప్రయత్నం చేశారని పట్నం నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఓట్లు వేసి గెలిపించిన రైతులకు బేడీలు వేసిన ఘనత రేవంత్ రెడ్డిదే అని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలని రేవంత్ రెడ్డికి సూచించారు. రైతుబంధుపై పెద్ద పెద్ద మాటలు చెప్పి మాట తప్పారని రేవంత్ రెడ్డిని పట్నం నరేందర్ రెడ్డి విమర్శించారు. అల్లు అర్జున్ అంశంపై గంటసేపు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాట్లాడారని పేర్కొన్నారు. కానీ రైతుల సమస్యలపై మాట్లాడమంటే సభను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి బంజారాహిల్స్ పోలీసులు నోటిసులు ఇచ్చారు. గురువారం ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. బంజారాహిల్స్ సీఐ విధులకు ఆటంకం కలిగించారనే కేసులో విచారణకు హాజరుకావాలని ఈ నోటీసులిచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఈ నెల 4వ తేదీన బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు 20మంది అనుచరులపై సైతం కేసు నమోదైంది. విధులను అడ్డగించడంతో పాటు బెదిరింపులకు దిగారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డి కలిసి తన ఫోన్‌ని ట్యాప్ చేస్తున్నారని.. వీరిద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదు చేసేందుకు ఈ నెల 4వ తేదీన పాడి కౌశిక్ రెడ్డి పీఎస్‌కి వెళ్లారు. బంజారాహిల్స్ ఏసీపీకి ఉదయం ఫోన్ చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు రమ్మన్నారని.. తాను స్టేషన్‌కు వెళ్లేకన్నా ముందే ఏసీపీ వెళ్లిపోయారని.. సీఐ సైతం వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తే తనతో పార్టీ కార్యకర్తలు ప్రశ్నించానని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తాను ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా సీఐ ప్రవర్తించారని.. డీజీపీ కన్నా ఎక్కువ ప్రోటోకాల్ ఎమ్మెల్యేకు ఉంటుందని .. పదవులు లేని సీఎం సోదరులకు పోలీసులు వంగి వంగి దండాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి : శ్రీనివాస్‌గౌడ్

**యాదాద్రి భువనగిరి, (క్రైమ్ మిర్రర్):** కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రైతు బంధు అమలుపై స్పష్టమైన హామీని నిలబెట్టుకోవాలి. యాదాద్రికి రాగానే రైతు బంధు హామీ గుర్తుకువస్తుంది. గ్రామాల వారిగా కలెక్టర్ నుంచి పూర్తి స్థాయి నివేదిక తీసుకురావాలి. జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి. అప్పుడే ఎన్నికలకు వెళ్ళాలి. న్యాయ పరమైన చిక్కులకు ప్రభుత్వమే బాధ్యత వ్యవహరించాలి. రూపాయీ ఖర్చు లేని హామీ రిజర్వేషన్ అమలు చేయాలి అని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్యంకొండ వద్ద రోప్ వే, సకల వసతులు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలి.

# హామీలు అమలు విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

### మహిళలను నమ్మించి మోసం చేసిన రేవంత్‌రెడ్డి

### పండుగలకు కనీసం బట్టలు కూడా ఇవ్వలేని కాంగ్రెస్ : ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలను నమ్మించి మోసం చేసిందని కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ ఎగిరిపోయాయని ఆమె ఎద్దేవా చేశారు. మెదక్ చర్చిని సందర్శించిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని సీఎం ప్రకటిస్తారని మహిళలకు ఆశించారు. కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటన చేస్తారని ఊహించారు. కానీ ప్రభుత్వం ఎటువంటి ఆలోచన చేయడం లేదు. రాష్ట్రంలోని ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ. 30 వేలు బాకీ పడింది. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇవ్వలేదు. తక్షణమే స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 శాతం నేరాలు పెరిగాయి. నేరాల పెరుగుదల.. ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సోయి ప్రభుత్వానికి లేదు. మహిళలు చూస్తూ ఊరుకోబోరు.. కచ్చితంగా ప్రశ్నిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టింది. తక్షణమే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి. రైతు భరోసా కింద అర్హులను తగ్గించే ప్రయత్నం చేయవద్దు. కేంద్ర ప్రభుత్వపు నిబంధలను అమలు చేస్తే 30 శాతం రైతులకు కూడా రైతు భరోసా రాదని కవిత పేర్కొన్నారు. మొక్కజొన్నలు, కందులు, సోయాబీన్, పత్తి వంటి పంటలను మద్దతు ధరను పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైంది..? ఏడాది కాలంగా ఏ ఒక్క పంటకు మద్దతు ధర ఇవ్వడం లేదు. చక్కెర ఫ్యాక్టరీలను ఎప్పుడు ఓపెన్ చేస్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సిందే. తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని కవిత డిమాండ్ చేశారు. తెలంగాణకు తలమానికం మెదక్ చర్చి. బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు క్రైస్తవులకు పేగుబంధం ఉంది. తెలంగాణ కోసం ప్రార్థన చేయని చర్చి లేదు. మత సహనానికి నిదర్శనం మెదక్. మెదక్ జిల్లాను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. కేసీఆర్ గోదావరి జలాలతో సింగూరును నింపారు. మెదక్‌కు నీళ్లు వచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను ప్రభుత్వం నిలిపివేడయం దారుణం. కేసీఆర్‌పై కోపాన్ని మెదక్ ప్రజలపై తీర్చుకుంటే ఏమొస్తుంది..? కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను కొనసాగించాలి అని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.



## ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు : కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. అంబేద్కర్ బతికినన్ని రోజులు ఆయన్ను కాంగ్రెస్ అవమానించిందని అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసిన అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఓడించిందని తెలిపారు. మంత్రిగా ఉన్న అంబేద్కర్‌తో నెహ్రూ రాజీనామా చేయించారని పేర్కొన్నారు. 1954 నుంచి 88 వరకు నెహ్రూ, ఇందిరాగాంధీ సహా 21 మందికి కాంగ్రెస్ భారతరత్న ఇచ్చిందని.. కానీ అంబేద్కర్‌ను ఎందుకు విస్మరించిందో సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో అంబేద్కర్ ఫొటో కూడా ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. దేశ ప్రజల స్ఫూర్తి ప్రదాత వాజ్‌పేయీ అని.. భారత దేశ వైభవాన్ని, నైతిక విలువలకు ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. ఆయన ఎప్పుడూ పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పనిచేశారని చెప్పారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోయినా ప్రజా తీర్పు కోరి మళ్లీ అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు.

## పీవీ సింధు రిసార్ట్స్ విశేషాలివే..?

హైదరాబాద్,డిసెంబర్ 25 (ఆర్ఎన్ఎ): బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు హైదరాబాదీ వ్యాపారవేత్త వెంకట దత్త సాయిని పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఆ జంట ఉదయ్‌పూర్‌లోని ఓ రిసార్టులో పెళ్లాడారు. ఆ వెడ్డింగ్ వేదిక గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం. చాలా విలాసవంతమైన, ప్రత్యేకమైన రఫేల్స్ ఉదయ్‌పూర్ రిసార్టులో సింధు పెళ్లి జరిగింది. ఆ కళ్యాణ వేదిక ఇప్పుడు టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారింది. సుందరమైన ప్రదేశంలో ఉన్న ఆ ఫైవ్ స్టార్ స్పాట్.. సింధు జీవితంలో ఓ ప్రత్యేకంగా నిలిచింది. 21 ఎకరాలు ఉన్న ఆ ప్యాలెస్ .. ఫ్రెంచ్ అల్ట్రా లగ్జరీ బ్రాండ్ రఫేల్స్ హొటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రాపర్టీగా గుర్తింపు ఉన్నది. సింగపూర్‌కు చెందిన రఫేల్స్ హొటల్ కూడా ఆ వేదికలోనే ఉన్నట్లు తెలిసింది. ఉదయ్ సాగర్ చెరువు మధ్యలో ఆ హొటల్ ఉంది. అరావలీ పర్వత అందాలు అక్కడ పర్యాటకుల్ని అమితంగా ఆకర్షిస్తుంటాయి. రిసార్టులోని వృక్షాలు,జంతువులు కూడా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తాయి. ఆ ఖరీదైన హొటల్‌లో ఒక రాత్రి అకామిడేషన్ సుమారు లక్ష వరకు ఉంటుందని భావిస్తున్నారు. ప్రైవేట్ పూల్స్, ఆర్ట్‌వర్క్స్, లాన్లు.. ఎంతో ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. యురోప్‌కు చెందిన పల్లాడియన్ ఆర్కిటెక్చర్ స్టయిల్‌లో ఆ హొటల్ ప్రాపర్టీని డెకరేట్ చేశారు. రాజ్‌పుత్-మొఘల్ ప్రావీణ్యం కూడా ఆ హొటల్ అందాల్లో కనిపిస్తుంది. చాలా లగ్జరీ రూమ్‌లు, సూట్‌లు ఉన్నాయి. డైనింగ్, స్పా, రఫేల్స్ లాంగ్ బార్, రైటర్స్ బార్ ఉన్నాయి. క్రికెటర్ హార్దిక్ పాండ్యా, అతని మాజీ భార్య నటాషా స్టాన్‌కోవిక్.. గత ఏడాది ఈ హొటల్‌లోనే తమ వెడ్డింగ్ స్మృతులను గుర్తు చేసుకున్నారు.



## క్రిస్మస్‌తో శాంతి, సౌభ్రాతృత్వం, సహనం


### తోటివారిని ప్రేమించండి.. తోటి వారికి ఉపకారం చేయండి : మాజీ మంత్రి హరీశ్‌రావు




**సిద్దిపేట, (క్రైమ్ మిర్రర్):** ఏసుక్రీస్తు ప్రబోధించిన ప్రేమ, కరుణ, శాంతి ఇతరుల పట్ల చూపించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. సిద్దిపేటలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏసు క్రీస్తు జన్మించిన డిసెంబర్ మాసం వచ్చిందంటే క్రైస్తవులందరికీ సంతోషంగా ఉంటుందని అన్నారు. ఈ క్రిస్మస్ మనందరికీ శాంతిని, సౌభ్రాతృత్వాన్ని, సహనాన్ని, క్షమాగుణాన్ని నేర్పుతుందని పేర్కొన్నారు. ఎదుటివారి పట్ల జాలి, దయ, క్షమాగుణం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు ప్రబోధించారని హరీశ్‌రావు అన్నారు. తోటివారిని ప్రేమించండి.. తోటి వారికి ఉపకారం చేయండి.. పది మందికి సహాయం చేసినపుడే నీ జన్మ ధన్యమవుతుందని ప్రభువు చెప్పారని తెలిపారు. తనను శిలువ వేసిన వారిని, తనను నానా మాటలు అన్నవారిని కూడా క్షమించండి అన్న గొప్ప దయామయుడు ఏసు క్రీస్తు అని కొనియాడారు. అందుకే ఏసుక్రీస్తు గొప్పతనాన్ని ప్రపంచమంతా గుర్తించిందని అన్నారు. దేశంలో క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా జరిపిన ఒకే ఒక ముఖ్యమంత్రి కేసీఆర్ అని హరీశ్‌రావు కొనియాడారు. క్రిస్మస్ తెల్లవారి బాక్సింగ్ డే రోజు కూడా కేసీఆర్ సెలవుగా ప్రకటించారని గుర్తుచేశారు. బతుకమ్మ పండుగకు హిందువులు, రంజాన్ పండుగకు ముస్లింలు, క్రిస్మస్ పండుగకు క్రైస్తవులు కొత్త బట్టలతో ఉండాలని కేసీఆర్ పదేళ్లపాటు తోఫాను అందించారని తెలిపారు. కానీ, దురదృష్టవశాత్తు ఇప్పుడున్న ప్రభుత్వం ఆ తోఫాలను కొనసాగించకుండా ఆపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మీ అందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరియాలని, మీ కోరికలు, కలలన్నీ నిజం కావాలని ఆకాంక్షిస్తున్నానని హరీశ్‌రావు అన్నారు.

## మెదక్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి

### పోలీసుల పటిష్ట బందోబస్తు... కొద్దిసేపు ట్రాఫిక్‌కు ఇబ్బందులు



**మెదక్, (క్రైమ్ మిర్రర్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ జిల్లాలో పర్యటించారు. క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో మెదక్ చర్చిని సందర్శించారు. అంతకుముందు ఏడుపాయల ఆలయాన్ని సందర్శించి, మొక్కులు చెల్లించుకున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే మెదక్‌కు వచ్చే దారులన్నీ పోలీసులు మూసివేసి అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో 40 నిమిషాల పాటు ప్రయాణికులు, వాహనదారులు నరకయాతన అనుభవించారు. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోవడంతో పోలీసుల తీరుపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌ను ఎందుకు ఆపారంటూ కొందరు ప్రయాణికులు, వాహనదారులు పోలీసులను ప్రశ్నించగా.. ముఖ్యమంత్రి వచ్చాడు.. మాకు పై నుండి ఆదేశాలు ఉన్నాయి. మీ వాహనాలకు అనుమతి లేదంటూ పోలీసులు నిలిపివేశారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ పోయే వరకు మేము వాహనాలను, నార్మల్ ప్రజలను అనుమతి ఇవ్వం అంటూ పోలీసులు తేల్చిచెప్పారు. పోలీసుల చర్యలతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదీ కాంగ్రెస్ పాలన అంటూ పెదవి విరిచారు. ఇక మెదక్ చర్చి వద్ద కూడా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వచ్చాడని చర్చి గేట్లు మూసివేశారు. దీంతో గేట్ల బయట వేలాది మంది క్రిస్టియన్లు గంటల తరబడి నిలబడిపోయారు. ఓ మహిళ పోలీసులపై తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని, సీఎం రేవంత్ రెడ్డి వల్ల సాధారణ ప్రజలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని ఆమె మండిపడ్డారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్



# సహనాన్ని కోల్పోయా.. క్షమించండి

## జాతీయ మీడియాకు సిపి సివి ఆనంద్ క్షమాపణలు

## ఎక్స్ వేదికగా వెల్లడించిన కమిషనర్

హైదరాబాద్: హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ క్షమాపణలు చెప్పారు. జాతీయ ÷ఖడియాను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు పోస్ట్ పెట్టారు. సంధ్య థియేటర్ ఘటనపై జాతీయ మీడియా ప్రశ్నలు అడిగినప్పుడు తాను సహనాన్ని కోల్పోయినట్లు తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద అసలేం జరిగిందో తెలుపుతూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తాజాగా మీడియా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. థియేటర్‌లో ఆరోజు ఏం జరిగిందో తెలుపుతూ కొన్ని వీడియోలను విడుదల చేశారు. ఈక్రమంలో మీడియా ఆయన్ను కొన్ని విషయాలపై ప్రశ్నించగా.. నేషనల్ మీడియా ఈ ఘటనకు మద్దతు ఇస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉన్న కొందరు జర్నలిస్టులు ఈ ఆరోపణలను తప్పుపట్టారు. తాజాగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సీవీ ఆనంద్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'ఈ ఘటనపై విచారణ జరుగుతోంది. ప్రెస్‌మీట్‌లో రెచ్చగొట్టే ప్రశ్నలు వేయడంతో నేను కాస్త సహనాన్ని కోల్పోయాను. పరిస్థితులు ఎలా ఉన్నా సంయమనం పాటించాల్సి ఉంటుంది. నేను చేసింది పొరబాటుగా భావిస్తున్నాను. నేషనల్ మీడియాపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. క్షమాపణలు కోరుతున్నా' అని తెలిపారు. మరోవైపు సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు సీపీ సమాధానమిచ్చారు. ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను ఆయన విడుదల చేశారు. ఇక ఈ ఘటనపై తాజాగా సినీ నటి, కాంగ్రెస్ నాయకురాలు మాజీ ఎంపీ విజయశాంతి స్పందించారు.

# ప్రమాదంలో వివాహ వ్యవస్థ!

**మా**నవ సంబంధాలు, కటుంబ, వివాహ వ్యవస్థలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం తరచూ తమ తీర్పులలో కీలక వ్యాఖ్యలు చేస్తుంటుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ జంటకు విడాకులు ఇచ్చే సమయంలో పెళ్లి బంధం గురించి సుప్రీంకోర్టు చాలా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. భార్యాభర్తల మధ్య వివాహ బంధం అనేది ఒకరిపై ఒకరికి పరస్పరం ఉండే విశ్వాసంపై ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆ జంట మధ్య నమ్మకం, సహచర్యం, వారిద్దరి మధ్య అనుభవాల పునాదులపై నిర్మితమై ఉంటుందని తెలిపింది. తన భర్త నుంచి తనకు విడాకులు మంజూరు చేస్తూ మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ ఇచ్చిన విడాకుల తీర్పును ఆ భార్య సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేసింది. ఆ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అంటే కలిసి ఉండాలని ఇద్దరిలో ఏ ఒక్కరికీ లేకపోయినా ఆ బంధం నిలబడదని సుప్రీంకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇక, విడాకుల తర్వాత భర్త నుంచి భార్య పొందే భరణానికి సంబంధించిన నిబంధనలు భార్య సంక్షేమానికి ఉద్దేశించినవే తప్ప భర్తను భయపెట్టేందుకో, శిక్షించేందుకో లేక దోపిడీ చేసేందుకో ఉద్దేశించినవి కావంటూ సుప్రీం కోర్టు మరొక కేసులో చేసిన వ్యాఖ్యలు ఎన్నదగినవి. భార్యా బాధితులకు ఊరటనిచ్చేవి కూడా. తన భర్త సంపదకు తగినట్లుగా తనకు భరణం ఇప్పించాలంటూ కేసు వేసిన ఓ గృహిణిని సర్వోన్నత న్యాయస్థానం మందలిస్తూ, ఒకవేళ విడాకులు

తీసుకున్నాక భర్త ఆర్థిక పరిస్థితి దిగజారితే బాధ్యత తీసుకుంటారా? అని ప్రశ్నించడం సహేతుకమే. భర్త, అత్తింటివారినుంచి డబ్బు వసూలు చేయాలన్న లక్ష్యంతోనే ఇలాంటి తీవ్రమైన ఆరోపణలతో కేసులు పెడుతున్నారని కూడా ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించడం గమనార్హం. మనోవర్తి అనేది రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కే కాదు, మానవ హక్కుల్లో అది ఒక భాగమని గతంలోనూ సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక వివాహ చట్టం, హిందూ వివాహ చట్టం, నేర న్యాయస్మృతి వంటివి మనోవర్తికి సంబంధించిన అంశాలను వివరిస్తున్నాయి. ఈ చట్టాలలోని లొసుగులను ఆధారం చేసుకుని భర్తనుంచి ఎక్కువ డబ్బు గుంజాలనుకునే మహిళలకు తాజా తీర్పు చెంపపెట్టులాంటిదే. గృహహింస నిరోధక చట్టమూ ఇలాంటి ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. తమను రాచిరంపాన పెట్టే భర్తలనుంచి, అత్తమామలనుంచి గృహిణులకు రక్షణ కల్పించే ఉద్దేశంతో 2005లో అమలులోకి వచ్చిన ఈ చట్టం కొందరు మహిళలకు పెట్టనికోటలా మారింది. అత్తమామల్ని, భర్తనూ

వేధించేందుకు ఈ చట్టం కొందరికి ఆయుధంగా మారుతోందని పలు సందర్భాల్లో న్యాయస్థానాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వివాహిత స్త్రీలకు గృహహింస నుంచి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన సెక్షన్ 498ఎ దుర్వినియోగమవుతోందంటూ గతంలో కలకత్తా హైకోర్టు వ్యాఖ్యానించింది. భర్తతో విభేదించిన మహిళలు అతని తరపు బంధువులందరినీ నిందితులుగా చూపుతున్నారంటూ బాంబే హైకోర్టు ఒక సందర్భంలో అసహనం వ్యక్తం చేసింది. మరో కేసులో అలహాబాద్ హైకోర్టు తీర్పు చెబుతూ పెళ్లికి సంబంధించిన ప్రతి కేసునూ వరకట్న వేధింపుల ఆరోపణలతో పెద్దదిగా చూపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ పేర్కొంది. అంతెందుకు, బెంగళూరుకు చెందిన ఓ టెకీ ఆత్మహత్య ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చనిపోయేముందు 80 నిమిషాల సేపు ఆయన చిత్రీకరించిన వీడియోలోనూ, 40 పేజీల సుదీర్ఘ లేఖలోనూ తన భార్య పెడుతున్న చిత్రహింసల గురించి వివరించిన తీరు మానవతావాదుల హృదయాలను ద్రవీభవింపజేసిందంటే అతిశయోక్తి కాదు. ఈ కేసు విషయంలో సుప్రీం కోర్టు వరకట్నం వేధింపుల చట్టాలు దుర్వినియోగం అవుతు న్నాయనీ, ఇలాంటి కేసుల విచారణలో జాగ్రత్తగా వ్యవహరించాలని న్యాయస్థానాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఇదే సందర్భంలో విడాకుల తర్వాత భార్యకు ఎంత భరణం ఇవ్వాలో లెక్కించేందుకు ఎనిమిది అంశాలతో మార్గదర్శక సూత్రాలను కూడా జారీ చేసింది. ఒకప్పుడు ఉద్యోగం పురుష లక్షణం అనేవారు. ఇప్పుడు ఆ నానుడికి కాలం చెల్లింది. గతంలో వంటింటి కుందేళ్లుగా ఉన్న మహిళలు ఇప్పుడు పురుషులతో సమానంగా విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటు న్నారు.



పురుషాధిక్య ప్రపంచపు కోటలను బద్దలు కొట్టి అన్ని రంగాలలోనూ దూసుకుపోతున్నారు. మంచిదే, అయితే, కాపురాన్ని ముందుకు నడిపించేవి దంపతులు మధ్య ప్రేమాభిమానాలు, ఆప్యాయతానురాగాలే తప్ప, ఒకరిపై ఒకరు చూపే ఆధిపత్య ధోరణులు ఎంతమాత్రం కాదు.

పవిత్రమైన హిందూ వివాహ వ్యవస్థ ఇటీవల పలుమార్లు కాలపరీక్షకు లోనవుతోంది. వివాహంపైనా, జీవితంపైనా సరైన అవగాహన లేని దంపతులు చిన్నాచితకా వివాదాలను కూడా భూతద్దంలోంచి చూస్తూ విడాకుల కోసం కోర్టుకు ఎక్కుతున్నారు. ఒకప్పుడు కాపురాల్లో కలతలు రేగితే పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పేవారు. ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది. పిల్లలు విడాకులు తీసుకోవాలనుకుంటే సర్దిచెప్పడం అలా ఉంచి, పెద్దలే దగ్గరుండి విడాకులు ఇప్పించే పరిస్థితులు దాపురించాయి. మరోవైపు, వివాహ వ్యవస్థ ఒడిదుడుకులకు లోనవుతున్న విషయాన్ని గమనిస్తున్న యువతీయువకులు పెళ్లిని కాదని, సహజీవనం వైపు మొగ్గుచూపుతున్నారు. దీని వల్ల భారతీయ వివాహ వ్యవస్థ ఉనికే ప్రమాదంలో పడుతోంది. గృహి హింస, మనోవర్తి చట్టాలు దుర్వినియోగం అవుతున్నంత మాత్రాన వాటిని రద్దు చేయాలనే వాదనలు ఎంతమాత్రం సహేతుకం కాదు. ఇప్పటికీ సమాజంలో మహిళలపట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. గృహహింసకు లోనవుతూనే ఉన్నారు. కాబట్టి, వారికి రక్షణగా రూపొందిన చట్టాలలోని లొసుగులను పరిహరించే ప్రయత్నం జరగాలి. వాటిని ఆసరా చేసుకుని భర్తలను, అత్తమామలను వేధించాలనుకునే మహిళల భరతం పట్టేలా చట్టాలను పటిష్టంగా రూపొందించాలి. లేనిపక్షంలో పవిత్రమైన వివాహ వ్యవస్థ నాశనమయ్యే ప్రమాదం ఉంది.

# సమభావం కు ఇల్లే పునాది కావాలి

వేల ఏళ్ల నాటి మను సంస్కతి భారతీయ సమాజాన్ని నేటికీ పీడిస్తూనే వుంది. 'స్త్రీ ఎప్పుడూ తండ్రి, భర్త, కొడుకు సంరక్షణలోనే వుండాలని, వేధించి హింసించే భర్తను కూడా పూజించాలి' అనే పురుషాధిక్య భావజాలాన్ని నేడు కూడా చలామణీ చేసేందుకు మనువాదులు యత్నిస్తున్నారు. దానికి నిదర్శనమే నేటికీ కొనసాగుతోన్న లింగ వివక్ష. స్త్రీ పట్ల సమాజం ఎంత అమానవీయంగా ప్రవర్తిస్తోందో తెలుపుతూ? 'నువ్వు ఆడదానివి, గీత దాటకూడని దానివి, మచ్చపడితే మాయని దానివి' అంటుందని చెబుతారు అబ్బూరి ఛాయాదేవి. ఈ మచ్చలు, గీతలు స్త్రీలకే గాని పురుషులకు లేవంటుందీ సమాజం. ఈ సమాజంలో అమ్మాయిలకు అడుగడుగునా అవరోధాలే..

వారి కదలికలపై ఎన్నో ఆంక్షలు, నిర్బంధాలు. పాప-బాబు, అమ్మాయి-అబ్బాయి, మహిళ-పురుషుడు అన్న ఈ పదాల మధ్య గీతలు చెరిపేసి, సమానం అని చెప్పాలనుకున్నా, పురుషాధిపత్య భావజాలం ఏదోఒక రూపంలో మొలకెత్తుతూనే వుంది.

ఇంట్లో కనీసం ఒక్క మగపిల్లాడైనా వుండాలని కోరుకునే భావన బలంగా వేళ్లూనుకుని వుంది. అమ్మాయిలైతే పెళ్లి తర్వాత అత్తవారింటికి వెళ్లిపోతారు, అదే అబ్బాయిలైతే వృద్ధాప్యంలో తమను చూసుకుంటారని, అండగా వుంటారని తల్లిదండ్రులు భావిస్తుంటారు. కానీ, కొడుకు కంటే కూతురే నయమని అనుభవం చెబుతోంది. సమాజం అన్ని రంగాల్లోనూ మారుతున్నా అమ్మాయిలు- అబ్బాయిల పెంపకం విషయంలో మాత్రం పెద్దగా మారలేదు. కుటుంబానికి స్త్రీ పురుషుల ఇద్దరి అవసరం ఉంటుంది. బండికి రెండు చక్రాల వంటి వారు. కానీ సమాజం వారిని వేరు చేసి

చూస్తె?ంది. ఈ తరహా విభజన ప్రాథమిక పాఠ్యాంశాల నుంచి సాహిత్యం వరకూ, సీరియళ్ల నుంచి సినిమాల వరకూ అబ్బాయిలకు ప్రాధాన్యతనివ్వడం చూస్తూనే వున్నాం. విద్యలోనూ వివక్షతే. మగపిల్లలను బయట చదువులకు పంపించే తల్లిదండ్రులు ఆడపిల్లలను పంపడానికి సంకోచిస్తారు. ఎవరో ఒకరినే చదివించాల్సిన పరిస్థితివుంటే అబ్బాయిలకే ప్రాధాన్యతనిస్తారు. పిల్లల పుట్టుక దగ్గర నుంచి పెంపకం వరకూ ఈ వివక్ష అడుగడుగునా కొనసాగుతూనే వుంది. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే పిండ దశలోనే అంతమొందిస్తున్నారు. 'జనాభా లెక్కల్లో స్త్రీలకంటే పురుషుల సంఖ్యే

ఎక్కువ' అని కేంద్ర ప్రభుత్వం గత వందేళ్లుగా నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదికలు చెబుతున్నాయి. ఇదంతా పురుషాధిపత్య భావజాల ఫలితమే. స్త్రీలను మగవారు తక్కవ చేసి చూడటం ఇంటి నుంచే మొదలవుతుంది. కాబట్టి ముందు తల్లులు మారాలి. అమ్మాయిల పట్ల కఠినత్వం కాకుండా, మార్ధవం అబ్బాయిల్లో జీర్ణించుకునేలా పెంచడం తల్లిదండ్రుల బాధ్యత. అమ్మాయి, అబ్బాయి సమానమేనన్న భావన ఇంటి నుంచి, చిన్న వయసు నుంచే మొదలవ్వాలి. అది తల్లిదండ్రుల బాధ్యత. ఇంటర్నెట్ యుగంలో సోషల్‌మీడియా, ఏఐ వంటి మాధ్యమాలు అందుబాటులో వున్న నేపథ్యంలో టీనేజ్ పిల్లల భావోద్వేగాలను నిశితంగా గమనిస్తుండాలి. ఒకవైపు కార్పొరేటీరణ, మరోవైపు మనువాదం నేర్పిన సనాతనధర్మం పురుష మెదళ్లలో చెత్తలా పేరుకుపోతోంది. ఈ చెత్తను తొలగించే బాధ్యత ఇంట్లో తల్లిదండ్రులది, పాఠశాలలో ఉపాధ్యాయులది. ఇంట్లో తల్లిని, చెల్లినీ గౌరవించడం నేర్పాలి. బయటి స్త్రీలకు కూడా అంతే గౌరవ మర్యాదలివ్వాలి. పాఠ్యాంశాల్లోనూ అమ్మాయి-అబ్బాయి సమానమన్న భావన పాదుకొల్పాలి. ఆ దిశగా అబ్బాయిలను పెంచాలి. వారి మానసిక వికాసానికి తోడ్పడాలి. వంట చేయడం, ఇల్లు తుడవడం వంటివి కేవలం అమ్మాయిల పని మాత్రమే కాదు,

అబ్బాయిలూ నేర్వాలన్న విజ్ఞత తల్లిదండ్రులే నేర్పాలి. ఇంటి పనంటే ఇంతులది కాదని చెప్పాలి. అమ్మాయిలతో పాటు అబ్బాయికీ అంట్లు తోమడం అలవాటు చేయాలి. అబ్బాయిల పెంపకంలో ఈ తరహా మార్పు అత్యవసరం.



## డ్యామిట్ ..కథ అడ్డం తిరిగింది!

తెలంగాణలో ఇకపై ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవు. సినిమా టికెట్ల ధరలూ పెంచేది లేదని తెలంగాణ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన ఈ ప్రకటన ఎందుకు చేశారో కూడా తెలిసిందే. ఇప్పుడు ఈ అంశమే తెలుగు రాష్ట్రాలలో హాట్ టాపిక్ గా మారింది. అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటన.. అల్లు అర్జున్ ప్రెస్‌మీట్.. తరువాత సినీ స్టార్ల ఇళ్లపై దాడులు ఇటు ఇండస్ట్రీలో, అటు జనంలో కూడా చర్చనీయంగా మారాచి. టికెట్ రేట్లు పెంచేది లేదని తెలంగాణ సర్కారు నిర్ణయం సంక్రాంతి సినిమాల వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన పుష్ప2 సినిమాకు ఏ ప్రభుత్వమూ ఇవ్వని విధంగా తెలంగాణ సర్కారు టికెట్ ధరలు పెంచుకునేందుకు అవకాశం ఇచ్చింది. అంతేకాదు, విడుదలకు ముందు రోజు అంటే డిసెంబరు 4న పెయిడ్ ప్రీమియర్ షోలకూ అనుమతి ఇచ్చింది. సదరు షోకు టికెట్ ధరకు అదనంగా రూ.800 పెంచుకునేలా వెసులుబాటు కల్పించింది. దీంతో సాధారణ థియేటర్‌లో టికెట్ ధర రూ.1000 దాటిపోగా, మల్టీప్లెక్స్‌లలో పన్నులతో కలిపి రూ.1200లకు పైనే అయింది. అలాగే, విడుదలైన రోజు నుంచి నాలుగు రోజులు ఒక్కో టికెట్ ధర దాదాపు రూ.500 వరకూ ఉంది. దీంతో 'పుష్ప2' భారీగా వసూళ్లు రాబట్టింది. తొలి రోజు అత్యధికంగా రూ.294 కోట్లు వసూలు చేసి చరిత్ర సృష్టించింది. ఇప్పటికే రూ.1500 కోట్లకు పైగా వసూలు చేసిందని అంటున్నారు. ఇక్కడి వరకూ బాగానే ఉంది. తరువాతే డ్యామిట్ కథ అడ్డం తిరిగింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగానే అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆ తర్వాత ఆయన బెయిల్‌పై బయటకు కూడా వచ్చారు. ఈ ఘటనపై ప్రతి పక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేయటం, అల్లు అర్జున్‌ను పరామర్శించేందుకు ఆయన ఇంటికి సినీతారలు క్యూ కట్టడం వంటి ఘటనలపైనా సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర చర్చ జరిగింది. ఈ క్రమంలోనే అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సంధ్య థియేటర్ ఘటన, తదనంతర పరిణామాలపై తీవ్రంగా స్పందించారు. థియేటర్ వద్ద జరిగిన విషాదకర ఘటన విషయంలో అల్లు అర్జున్ సహా, సినీ ప్రముఖులు కనీసం మానవీయ కోణంలోనూ స్పందించలేదని అన్నారు. సామాన్యుల ప్రాణాలు పోతున్నా సరే ప్రత్యేక సదుపాయాలు కల్పించాలంటే మాత్రం కుదరదని స్పష్టంచేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ఈ విషయాన్నే ధ్రువీకరించారు. దీంతో రాబోయే సంక్రాంతి సినిమాలపై ప్రభుత్వ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది.సంక్రాంతికి వినోదాల విందును పంచడానికి పలు చిత్రాలు రెడీ అయ్యాయి. ఈ ముగ్గుల పండగకు మొదటగా ప్రేక్షకులను పలకరించే చిత్రం 'గేమ్ ఛేంజర్'. రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 10న విడుదల కానుంది. దాదాపు రూ.450 కోట్ల భారీ బ్జడెట్‌తో దిల్‌రాజు ఈ మూవీని నిర్మించారు. 'పుష్ప2'కు ఇచ్చినట్లే స్పెషల్ ప్రీమియర్‌కు అనుమతి లభిస్తుందని, టికెట్ ధరల పెంపుతో పాటు, బెనిఫిట్ షోలకు అనుమతి వస్తుందని చిత్ర బృందం అందుకు తగిన ఏర్పాట్లకు సిద్ధమవుతూ వస్తోంది. 'పుష్ప2'ను దాటేలా వసూళ్లు రాబట్టే అవకాశం ఉందని అంచనాలు కూడా వేశారు. అయితే, ఇప్పుడు తెలంగాణ సర్కారు ప్రకటనతో 'గేమ్ ఛేంజర్' వసూళ్లు తారుమారయ్యే పరిస్థితి నెలకొంది. బెనిఫిట్ షోల సంగతి పక్కన పెడితే, టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని ప్రభుత్వం చెప్పడం ఒకరకంగా షాక్ ఇచ్చినట్లే. మరోవైపు అటు సీఎం ప్రకటన, ఇటు అల్లు అర్జున్ ప్రెస్‌మీట్‌తో ఈ అంశం మరింత హీటెక్కింది. ఈ పరిస్థితుల్లో టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇచ్చే అవకాశం లేనట్లే. 'గేమ్ ఛేంజర్'తో పాటు ఈ సంక్రాంతి బరిలోకి దిగనున్న మారో మూవీ 'డాకూ మహారాజ్'. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ మూవీ టికెట్ ధరల పెంపునకు కూడా అవకాశం ఉంటుందని భావించారు. తాజా నిర్ణయంతో వసూళ్లు ఆశించిన స్థాయిలో వచ్చే అవకాశం లేదంటున్నారు. బాలకృష్ణ గత చిత్రం 'భగవంత్ కేసరి' ఫుల్ రన్‌లో దాదాపు రూ.130 కోట్లు వసూలు చేసింది అప్పుడు టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలు ఉన్నాయి. ఇప్పుడు అవేవీ లేకుండా ఆ మార్కును అందుకోవడం కష్టంగా కనిపిస్తోంది. వీటితో పాటు వస్తున్న మరో మీడియం బ్జడెట్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'. ఇది మాస్ మూవీ కాదు. పక్కా కుటుంబ ప్రేక్షకులే లక్ష్యంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఇది రాబోతోంది. ప్రీమియర్, బెనిఫిట్ షోలు లేకపోయినా, టికెట్ ధరలు పెంచుకునే వెసులుబాటు ఉంటుందని భావించారు. ఈ మూవీకి కూడా దిల్‌రాజు నిర్మాత కావడం విశేషం. ప్రభుత్వం నిర్ణయంతో దీనిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇండస్ట్రీ లెక్కలు తారుమారు చేయనున్న ప్రభుత్వం నిర్ణయంపై సినీ పెద్దలు ఎలా స్పందిస్తారో చూడాలి. మరోవైపు తెలంగాణ సర్కారు బాటలోనే ఏపీ ప్రభుత్వం నడుస్తుందా? సంక్రాంతి సినిమాలపై అక్కడి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం ఆసక్తిని రేపుతోంది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 25-12-2024


# యేసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలి

## పిఏసిఎస్ చైర్మన్ ఏసు కనకమగులయ్య బ్లాక్ అధ్యక్షులు కర్రె భరత్ కుమార్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్, కుల్కచర్ల పిఏసిఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పరిగి బ్లాక్ అధ్యక్షులు కర్రె భరత్ కుమార్ సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామంలో బుధవారం ఎల్-షాద్దాయ్ చర్చి పాస్టర్ గుమ్మడి డానియల్ ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు దయామయుడు కరుణామయుడు ప్రేమామయుడు అయిన యేసు బోధనలు ప్రతి ఒక్కరు విని వారు చూపిన మార్గంలో నడవాలని వారు తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రం రాములు, జీ నరసింహులు, బి రామచంద్రయ్య, ఎర్రం నరసింహులు, మొగులయ్య, క్రైస్తవ విశ్వాసులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది



## పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: క్రీడల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి సూచించారు. వికారాబాద్ జిల్లా దోమ మండలం ఐనాపూర్ గ్రామంలో జెడ్ పి హెచ్ ఎస్ పూర్వ విద్యార్థులు ఏర్పాటుచేసిన కీ?శే? శ్రీ జె.లక్ష్మారెడ్డి స్మారక రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ క్రీడోత్సవాలకు డిసిసి అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరికి అవసరమని, దేహాదారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని వారు తెలిపారు. ఈ క్రీడల గురించి తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వారు తెలిపారు.కీ?శే? శ్రీ జె.లక్ష్మారెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని,యువతకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. క్రీడలు ఆడడం వల్ల శారీరక దారుఢ్యం,ఆరోగ్యంగా ఉండడానికి తోడ్పడతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాలీబాల్ ఆడుతూ క్రీడకారుల్లో ఉత్సాహాన్ని నింపారు.ప్రణాళిక ప్రకారం ఐనాపూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం అని తెలిపారు.

# కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు

**కరాటేలో ప్రతిభను చాటిన ఆక్స్ఫర్డ్ విద్యార్థులు విశ్వనాథ్, లోకేష్**

**నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2024**

**కరాటే పోటీలో సత్తా చూపిన బాలాపూర్ అక్స్ ఫార్డ్ విద్యార్థులు**

**విశ్వనాథ్,లోకేష్ ను అభినందించిన ఆర్గనైజేషన్ టీమ్**

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ లోని అక్స్ ఫార్డ్ స్కూల్ విద్యార్థులు కరాటేలో ఉత్తమ ప్రతిభను కనబరిచారు, ఇటీవలే ఈ నెల 22వ. తేదీలో మేడ్చల్ లో నిర్వహించిన నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2024 ను డైనమిక్ చోటే ఖాన్ కరాటే ఆర్గనైజేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ప్రముఖ సినీ నటుడు కరాటే లెజెండ్ సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. పట్టుదల ఉంటే ఎంతటి కార్యనైనా సాధించవచ్చని అన్నారు.ఈ యొక్క పోటీలలో వివిధ పాఠశాలల నుండి విచ్చేసిన విద్యార్థులు కరాటే పోటీలో పాల్గొన్నారు.అందరిలో కన్నా బాలాపూర్ అక్స్ ఫార్డ్ విద్యార్థులు కరాటే పోటీలో పాల్గొని విశ్వనాథ్,లోకేష్ ఉత్తమ క్రీడాకారులుగా నిలిచారు, ఇంత చిన్న వయస్సులో నేషనల్ కరాటే పొలిటిలో పాల్గొని విజయం సాధించడం గర్వాంగా ఉందన్నారు,జోనల్ ఇంచార్జ్ సుమలత ఇలాంటి విజయాలు మరెన్నో తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అక్స్ ఫార్డ్ ప్రిన్సిపాల్ కర్నాటి కవిత,డైరక్టర్ కృష్ణ, శ్రీ వాసన్ ఆఫ్ ఎక్స్ లెన్స్ అకాడమీ కోచ్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## బౌన్సర్లను పెట్టిందే రేవంత్‌రెడ్డి : రఘునందన్‌రావు

మెదక్: బౌన్సర్ల దుకాణం పెట్టిందే రేవంత్ రెడ్డి అని రఘునందన్ రావు పేర్కొన్నారు. ప్రయివేటు బౌన్సర్లను తీసుకువచ్చి నూకిపిచ్చే సంస్కృతి రాష్ట్రానికి తీసుకొచ్చిందే రేవంత్ రెడ్డి. పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు చుట్టూ బౌన్సర్లని పెట్టుకొని జనాలను పక్కకు నూకే కార్యక్రమం మొదలు పెట్టిందే రేవంత్ రెడ్డి. అల్లు అర్జున్ పంచాయితీలో బౌన్సర్లలను ఎందుకు తీసుకొస్తున్నారు? అని రఘునందన్ రావు ప్రశ్నించారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌కు చిత్తశుద్ధి ఉంటే బౌన్సర్ల వ్యవస్థను మొత్తం రద్దు చేయమని చెప్పండి అని ఎంపీ రఘునందన్ రావు సూచించారు.

## రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు

అమరావతి: పశ్చిమ మధ్య - నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం.. రానున్న 24 గంటల్లో ఇది క్రమంగా బలహీన పడుతోందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ ప్రభావం కారణంగా రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తాలోని పలు చోట్లు వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. అలాగే దక్షిణ కోస్తాలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. రాగల 24 గంటల్లో ఒకటి రెండు చోట్లు భారీ వర్షాలుకురిస్తాయని తెలిపింది. ఈ సమయంలో సముద్రం తీరం వెంబడి గాలుల తీవ్రత అధికంగా ఉంటుందని సూచించింది. చేపల వేటకు సముద్రంలోకి వెళ్ల వద్దని మత్స్యకారులను ఈ సందర్భంగా వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇక విశాఖపట్నం, కాకినాడ , నిజాంపట్నం, మచిలీపట్నం పోర్టుల్లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని స్పష్టం చేసింది. మరోవైపు అల్ప పీడనం కారణంగా.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వర్షం కురుస్తోంది. అలాగే ఆకాశం మేఘావృతమైంది. ఇక సరిగ్గా వరి పంట కోతకు వచ్చే సమయంలో ఇలా అల్పపీడం ఏర్పడడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట సరిగ్గా చేతికి వచ్చే సమయంలో ఇలా ముసురు కమ్ముకొని తమను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకోవైపు రాష్ట్రంలోని వివిధ జిల్లాలోని రైతులు.. భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. అందులోభాగంగా వరి పంటను కోసి.. చేలలో కుప్పలుగా వేశారు. ఇంకోవైపు భారీ వర్షాలు నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సైతం అప్రమత్తమైంది. ఆ క్రమంలో జిల్లాల ఉన్నతాధికారులను అప్రమత్తం చేసింది. ఎక్కడ ఎటువంటి అంవాఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా విద్యుత్, నీటి పారుదల శాఖల అధికారులను అలర్ట్‌గా ఉండాలని సూచించింది.



# చిన్న వయసు...గొప్ప మనసు

**స్ఫూర్తిగా నిలిచిన మోత్కుపల్లి మాజీ సర్పంచ్ మనువరాలు సహస్ర**

**చర్చికి విరాళంగా గళ్ళగురిగి డబ్బులు అందజేత**

**చిన్నారి చేసిన పనికి పలువురు ప్రశంసలు**

**చేవెళ్ల (క్రైమ్ మిర్రర్):** చిన్న పిల్లలు ఏ పని చేసినా మనసుకు ఆనందంగా..అల్లారు ముద్దుగానే అనిపిస్తోంది.అలాంటి ఓ చిన్న వయసు చిన్నారి గొప్ప మనసును చాటుకుంది.వివరాల్లోకి వెళితే..మొయినాబాద్ మండలం మోత్కుపల్లి మాజీ సర్పంచ్ రాంచందర్ (రత్నం)మనువరాలు,పాప తల్లితండ్రులు కార్తీక్ కుమార్,విజయవాణిల కూతురు సహస్ర(6సం)సంవత్సరం అంతా తన బుజ్జి బుజ్జి చేతులతో గళ్ళగురిగిలో దాచుకున్న ధనమును బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని గ్రామ చర్చికి విరాళంగా ఇచ్చి స్ఫూర్తిగా నిలిచింది.ఈ చక్కటి ఆలోచనకు చిన్నారిని పలువురు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ వేణు కుమార్,నవీన్,రాజేష్,నర్సింహా,భాస్కర్, సంగస్తులు,గ్రామస్తులున్నారు.

# నక్కలపల్లిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**చేవెళ్ల (క్రైమ్ మిర్రర్):** ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ బుధవారం మొయినాబాద్ మండలం నక్కలపల్లి చర్చిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముఖ్య అతిథిగా నిరంజన్ గౌడ్ పాల్గొన్నారు.అనంతరం సంఘ పెద్దలతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి..తేనేటి విందును ఏర్పాటు చేశారు.అంతకు ముందు పాస్టర్ మాట్లాడుతూ అందరూ దేవుడి ప్రేమతో మెలగాలన్నారు.ఈ వేడుకలో సంగస్తులు,గ్రామస్తులున్నారు.

# హరిత ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్

**కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానం తీసుకొస్తున్నం: భట్టి**

హైదరాబాద్: హరిత ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, జాతీయ స్థాయిలో పెట్టుకున్న లక్షాన్ని అందుకోడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని ప్రతిపాదించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2030 నాటికి స్వచ్ఛమైన, స్థిరమైన 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ గరిష్ఠ విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందన్నారు. 2023-24లో 15,623 మెగావాట్లు, 2027-28లో 20,968 మెగావాట్లు, 2034-35లో 31,809 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ - 2024పై వచ్చే నెల 3న హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ లో వాటాదారుల సమావేశం నిర్వహిస్తున్నామని భట్టి తెలిపారు.

# ప్రేమ వేధింపులకు యువతి బలి

**యాసిడ్ తాగి బలవన్మరణం**

హైదరాబాద్: హైదరాబాద్ జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. ప్రేమ వేధింపులు తట్టుకోలేక యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డిగ్రీ విద్యార్థిని చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. న్యూ భవానీ నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థిని పూర్ణిమ.. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి రాగానే యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ప్రేమ పేరుతో నిఖిల్ అనే యువకుడు వేధిస్తున్నాడని, అతని వేధింపులు తట్టుకోలేక తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు ఆరోపించారు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జవహర్‌నగర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాన్ని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన కుటుంబసభ్యులు.. ఆందోళనకు దిగారు.



## ఐటీ ఉద్యోగాలు.. ఇంకొన్నాళ్లు ఇంతే!

భారతీయ ఐటీ సేవల పరిశ్రమలో 2025%-%26 రెండవ అర్ధ భాగం నాటికి వృద్ధి ఊపందుకునేంత వరకు నియామకాలు సమీప కాలంలో తక్కువ స్థాయిలోనే ఉంటాయని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. ఇక్రా నివేదిక ప్రకారం.. యుఎస్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయడం వల్ల తక్షణ కాలంలో కొంత విధానపర అనిశ్చితి ఏర్పడవచ్చు. అనిశ్చిత స్థూల ఆర్థిక వాతావరణం మధ్య యూఎస్, యూరప్‌లోని కీలక మార్కెట్లలో కస్టమర్లు సాంకేతికతపై తక్కువ వ్యయం చేయడంతో 6%-%8 త్రైమాసికాల్లో భారతీయ ఐటీ సేవల కంపెనీలకు డిమాండ్ తగ్గింది. తక్కువ అట్రిషన్, ఉద్యోగుల వినియోగాన్ని పెంచడంపై దృష్టి పెట్టడం వంటి అంశాలు కూడా నియామకాల్లో మందగమనానికి కారణం అయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ2లో కొంత రికవరీ ఉన్నప్పటికీ.. 2025%-%26 అక్టోబర్%-%మార్చి నాటికి వృద్ధి ఊపందుకుంటున్నంత వరకు సమీప కాలంలో నియామకాలు తక్కువగానే ఉంటాయి.

**నైపుణ్యాన్ని పెంచుతున్నాయి..**

2021%-22, 2022-%23 కాలంలో జోడించిన ఉద్యోగుల వినియోగం పెరుగుదల 2023%-24, 2024-%25 క్యూ1లో ఐటీ సేవల కంపెనీల నియామకాలపై ఒత్తిడి తెచ్చింది. అట్రిషన్ స్థాయిల పెరుగుదలతో పాటు, ఇక్రా ఎంచుకున్న కంపెనీలకు 2024%-%25 క్యూ1 వరకు ఏడు త్రైమాసికాల్లో నికర ఉద్యోగుల చేరిక ప్రతికూలతకు దారితీసింది. ఈ జాబితాలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టెక్ మహీంద్రా, విప్రో లిమిటెడ్ ఉన్నాయి.

జనరేటివ్ (జెన్) ఏఐ వేగంగా ప్రవేశిస్తున్నందున ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యాపార అవకాశాలను అన్వేషించడం ద్వారా అన్ని ప్రముఖ ఐటీ సేవల కంపెనీలు తమ ఉద్యోగులకు నైపుణ్యాన్ని పెంచుతున్నాయి. కోవిడ్‌కు ముందు ఉన్న స్థాయిలతో పోలిస్తే ఇది తాజా నియామకంలో మొత్తం నియంత్రణకు దారితీసే అవకాశం ఉందని అంచనా. ఉద్యోగుల ఉత్పాదకతను మెరుగుపరచడం కోసం జనరేటివ్ ఏఐ విస్తృత స్వీకరణ ప్రభావం రాబోయే కొన్ని సంవత్సరాలలో కనిపిస్తుందని ఇక్రా నివేదిక తెలిపింది.

**డిమాండ్ నియంత్రణతో..**

నివేదిక రూపకల్పనకు ఇక్రా ఎంచుకున్న కంపెనీల్లో ఒక్కో ఉద్యోగికి సగటు ఆదాయం 2019%-%20 నుంచి 2023%-%24లో దాదాపు 50,000 డాలర్ల వద్ద స్థిరంగా ఉంది. 12 నెలల అట్రిషన్ రేటు 2021%-%22 క్యూ4, 2022%-%23 క్యూ1 సమయంలో దాదాపు 23 శాతానికి చేరుకుంది. నియామకాలు పెద్ద ఎత్తున జరగడం, ఆ తరువాత డిమాండ్%-%సరఫరా అసమతుల్యత ఇందుకు కారణం.యూఎస్, యూరప్‌లోని కీలక మార్కెట్లలో డిమాండ్ నియంత్రణ కారణంగా ఐటీ సేవల కంపెనీల ద్వారా తక్కువ నియామకాలతో అట్రిషన్ క్రమంగా క్షీణించింది. ఇక్రా నమూనా కంపెనీల అట్రిషన్ రేటు 2023%-%24 క్యూ3 నుండి దాదాపు 13 శాతం వద్ద స్థిరీకరించడం ప్రారంభించింది.




# రివర్స్ మార్టగేజ్

## ఈ గృహ రుణం ఎవరికి, ఎలా వస్తుందో తెలుసా!

సంప్రదాయ గృహ రుణానికి భిన్నంగా ఇటీవలికాలంలో రివర్స్ మార్ట్‌గేజ్ లోన్లు స్థిరాస్తి మార్కెట్‌లో పాపులారిటీని సంతరించుకుంటున్నాయి. వృద్ధాప్యంలో ఏ ఆదాయం లేని ఇంటి యజమానులకు నిజంగా ఇవి ఆర్థిక భరోసానే కల్పిస్తున్నాయి. నగదు అవసరాలు లేదా ఇతరత్రా జీవన వ్యయాల కోసం ఉన్న ఇంటిని అమ్ముకొని రోడ్డునపడకుండా ఉన్న ఇంట్లోనే సంతోషంగా ఉంటూ ఆర్థిక భద్రతను పొందేలా ఈ లోన్లు సీనియర్ సిటిజన్లకు కలిసొస్తున్నాయి.

**ఏయే రకాలు? హెూం ఈక్విటీ కన్వర్షన్ మార్ట్‌గేజ్**

ఈ హెచ్‌ఈసీఎం పథకం అత్యంత ఆదరణ కలిగినది. రివర్స్ మార్ట్‌గేజ్ వెసులుబాటు విస్తృతంగా అందుబాటులో ఉంటుంది. 62, ఆపై వయసు కలిగినవారి కోసం దీన్ని రూపొందించారు. ఇంటి ఈక్విటీలో కొంత భాగాన్ని నగదులోకి మార్చుకోవచ్చు.

**ప్రొప్రైటరీ రివర్స్ మార్ట్‌గేజ్**

ఈ సదుపాయాన్ని ప్రైవేట్ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు అందిస్తున్నాయి. అధిక విలువ కలిగిన ఇంటి యజమానుల కోసం దీన్ని డిజైన్ చేశారు. అయితే హెచ్‌ఈసీఎంకు అర్హత లేకపోతేనే దీనికి అర్హులు.

**సింగిల్-పర్పస్ రివర్స్ మార్ట్‌గేజ్**

ఓ నిర్ధిష్ట అవసరం కోసం నగదు కావాలనుకునే ఇంటి యజమానులను దృష్టిలో పెట్టుకొని తెచ్చినదే ఈ పథకం. ఇంటి అభివృద్ధికైనా లేదా వైద్య ఖర్చులైనా కావచ్చు. దీన్ని నాన్-ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్, ప్రభుత్వ ఏజెన్సీలు వాడుకొంటాయి.

**ఏయే డాక్యుమెంట్లు అవసరం?**

రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ పొందడానికి ఓటర్ ఐడీ, పాన్, ఆధార్, పాస్‌పోర్ట్, ఎంప్లాయీస్ ఐడీ కార్డ్ వంటి ఐడెంటిటీ ప్రూఫ్‌లు అవసరం.

- అడ్రస్ ప్రూఫ్‌లుగా ఓటర్ ఐడీ కార్డ్, కరెంట్ బిల్లు, పాస్‌పోర్ట్ వంటివి చూపించవచ్చు.
- ఇల్లు మీదే అని చెప్పడానికి టైటిల్ డీడ్, ప్రాపర్టీ ట్యాక్స్ రశీదులు, మీ పేరిట ఉన్న కరెంట్ లేదా గ్యాస్ ఇతరత్రా బిల్లులు కావాలి.
- పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు అవసరం. కావాల్సిన మరికొన్ని పత్రాలనూ సమర్పించాల్సిందిగా రుణదాతలు కోరవచ్చు.
- ఫీజులు-చార్జీలు
- ఈ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ కోసం ఫీజులు, చార్జీలు ఆయా బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలనుబట్టి మారుతూ ఉన్నాయి.
- ప్రాసెసింగ్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్ చార్జీలు వంటివి ఉంటాయి.
- రుణం తీసుకున్నాక నిబంధనలకు విరుద్ధంగా ముందే చెల్లించినా, ఒక బ్యాంక్ నుంచి మరో బ్యాంక్ లేదా సంస్థలకు మారినా జరిమానాలు పడుతాయి.
- హెూం ఇన్సూరెన్స్ పాలసీకి సంబంధించి అన్ని ప్రీమియంల చెల్లింపులు సకాలంలో ఉండాలి.
- గుర్తుంచుకోండి
- సాధారణ గృహ రుణాలతో పోల్చితే ఈ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్లపై అధిక వడ్డీరేట్లు పడుతాయి.
- మార్కెట్ ట్రెండ్‌కు తగ్గట్టే ఫిక్స్‌డ్ లేదా ఫ్లోటింగ్ రేట్ల విధానాలను రుణగ్రహీతలు ఎంచుకోవచ్చు.
- ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 10(43) కింద ఈ రుణం ద్వారా అందుకునే లంప్సమ్ లేదా వాయిదా చెల్లింపుల ఆదాయంపై సీనియర్ సిటిజన్ల (రుణగ్రహీతలు)కు పన్ను మినహాయింపుంటుంది.
- ఈ లోన్ తీసుకునేటప్పుడు తెలియకపోతే ఏ డాక్యుమెంట్లపైనా సంతకాలు చేయవద్దు. గుర్తుతెలియని సంస్థలు ఆఫర్ చేసే రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ల వైపు వెళ్లకపోవడమే మంచిది.
- మరింత సమాచారం, అవగాహన కోసం బ్యాంకులకు నేరుగా వెళ్లి, అక్కడి ప్రతినిధులను సంప్రదించడం ఉత్తమం.
- రుణం కావాలను కునేవారికి ఆన్‌లైన్ దరఖాస్తుతో 4 రోజుల్లోనే అప్రూవల్ ఇస్తున్న దేశంలోని పలు ప్రైవేట్ బ్యాంకులు.

**అర్హత ఏంటి?**

- రుణగ్రహీతకు 60 ఏండ్లు, ఆపైనే ఉండాలి. కో-బారోవర్‌గా భర్త లేదా భార్య ఉంటే వారి వయసూ 55 ఏండ్లు దాటాలి.
- ఏ ఇంటి ద్వారా మీరు రివర్స్ మార్ట్‌గేజ్ లోన్‌కు వెళ్లాలనుకుంటున్నారో.. ఆ ఇల్లు మీకు (రుణగ్రహీత) పూర్తిగా సొంతమైనదై ఉండాలి. అలాగే ఆ ఇల్లు మీ ప్రధాన నివాసమై ఉండాలి. అంతేగాక ఇంకా 20 ఏండ్లకుపైగా నివాసయోగ్యమైనదై ఉండాలి.
- రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ తీసుకునే ఇంటికి ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉండకూడదు. దానిపై ఏ అప్పులూ ఉండరాదు. ఇంటికి ఏ సమస్య లేకుండా ఎప్పటికప్పుడు రిపేర్ చేస్తూ చక్కగా కాపాడుకోవాలి.
- రుణగ్రహీత ఆదాయం, క్రెడిట్ స్కోర్, అప్పు చెల్లించే సామర్థ్యం ఇలాంటి వేటినీ రుణదాత (బ్యాంక్ లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ)లు పరిశీలించారు. ఇంటి పరిస్థితి, దానికి సంబంధించిన అన్ని అంశాలనే క్షుణ్ణంగా చూస్తారు.

### ఇదీ సంగతి..

- రివర్స్ మార్ట్‌గేజ్‌లో ఇంటి విలువలో 80 శాతందాకా రుణంగా లభిస్తుంది.
- ఒకేసారి లేదా నెల, త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక వాయిదాల్లో ఇంటి యజమాని (రుణగ్రహీత)కి రుణం సొమ్ము అందుతుంది.

రుణం తీసుకున్నాక ఆ ఇంట్లోనే రుణగ్రహీతలు ఉండవచ్చు. ఇంటిని అమ్ముకోవడమో, లేకుంటే ఖాళీ చేయడమో, లేదా రుణగ్రహీత(లు) చనిపోయాకే రుణం, వడ్డీ చెల్లింపులు మొదలవుతాయి. అప్పటిదాకా ఎలాంటి చెల్లింపులుండవు.

- తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించాకే రుణగ్రహీత (యజమాని) లేదా వారసులకు ఇంటిపై మళ్లీ హక్కులు వస్తాయి.

రుణం చెల్లించలేని పరిస్థితులు తలెత్తితే రుణం ఇచ్చినవారు ఇంటిని వేలం వేసి బకాయిలను వసూలు చేసుకుంటారు.


## మెరుగైన నెట్‌వర్క్‌లో వొడాఫోన్‌ఐడియాకు గుర్తింపు

తెలుగు రాష్ట్రాల్లో వొడాఫోన్‌ఐడియా 4జీ నెట్‌వర్క్ అత్యుత్తమ నెట్‌వర్క్‌గా గుర్తింపు పొందినట్లు కంపెనీ తెలిపింది. నవంబర్ నెలలో కంపెనీ మెరుగైన నెట్‌వర్క్ అందించినట్లు ఓపెన్‌సిగ్నల్ 4జీ నెట్‌వర్క్ ఎక్స్‌పీరియన్స్ రిపోర్ట్ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 4జీ డౌన్‌లోడ్ స్పీడ్, వీడియో స్ట్రీమింగ్, లైవ్ వీడియో ప్రసారం, 4జీ వాయిస్ వంటి సర్వీసుల్లో పటిష్ట సేవలు అందిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించినట్లు కంపెనీ పేర్కొంది. ఇటీవల బ్యాండ్‌విడ్త్ అప్‌గ్రేడ్ చేయడం, 8700 పైగా లొకేషన్లను తమ నెటవర్క్ పరిధిలోకి తీసుకురావడం వంటి తదితర అంశాలు ఇందుకు ఎంతో తోడ్పడ్డాయని ఏపీ, తెలంగాణ, కర్ణాటక క్లస్టర్ బిజినెస్ హెడ్ ఆనంద్ దానీ తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అత్యుత్తమ 4జీ నెట్‌వర్క్ అందిస్తున్నందుకుగాను మాకు గుర్తింపు లభించడం చాలా సంతోషంగా ఉంది. మా నెట్‌వర్క్‌ను మరింత పటిష్ఠ పరిచేందుకు, నిరాంటకంగా కనెక్టివిటీ ఉండేలా చూసేందుకు మేము చేస్తున్న ఇన్వెస్ట్‌మెంట్ ప్రతిఫలమే ఈ గుర్తింపులు. వినియోగదారులకు ఆటంకంలేని అత్యుత్తమ కనెక్టివిటీని అందించడానికి మేము కట్టుబడి ఉన్నాం' అని ఆనంద్ దానీ పేర్కొన్నారు.




## ఏఐకి సవాళ్లు.. హ్యాకింగ్ రిస్కులు!

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) గణనీయంగా ప్రాచుర్యంలోకి వస్తున్నప్పటికీ దీన్ని వినియోగించుకోవడంలో కంపెనీలు కాస్త ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. హ్యాకింగ్, సైబర్ దాడులు వంటి రిస్కులే ఏఐ వినియోగానికి అతి పెద్ద సవాళ్లుగా ఉంటున్నాయని ఒక సర్వేలో 92% మంది భారతీయ ఎగ్జిక్యూటివ్‌లు అభిప్రాయపడ్డారు. ఇందుకు ప్రైవసీ రిస్కులు కారణమని 91% మంది, నియంత్రణపరమైన అనిశ్చితి కారణమని 89% మంది తెలిపారు. డెలాయిట్ ఏషియా పసిఫిక్ రూపొందించిన 'ఏఐ ఎట్ క్రాస్‌రోడ్స్' నివేదికలో ఈ అంశాలు వెల్లడి అయ్యాయి.




ఏఐ సంబంధ రిస్కులను ఎదుర్కొనడంలో తమ సంస్థలకు తగినంత స్థాయిలో వనరులు లేవని 50 శాతం మంది పైగా టెక్ వర్కర్లు తెలిపారు. గవర్నెన్స్‌పరంగా పటిష్టమైన విధానాలను పాటించడం, నిరంతరం కొత్త సాంకేతికతల్లో శిక్షణ పొందాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తోందని డెలాయిట్ వివరించింది.

- ఏఐ వినియోగంపై కంపెనీలకు ఆశావహ భావం కూడా ఉన్నట్లు నివేదిక పేర్కొంది.
- నైతిక విలువలతో ఏఐను వినియోగించేందుకు 60% మంది ఉద్యోగులకు నైపుణ్యాలు ఉన్నాయని తెలిపింది.
- ఉద్యోగాల్లో నైపుణ్యాలపరంగా ఉన్న అంతరాలను తొలగించేందుకు 72% సంస్థలు క్రియాశీలకంగా పని చేస్తున్నాయని నివేదిక వివరించింది.విభిన్న రంగాల్లో సేవలందిస్తున్న టెక్ కంపెనీలకు సంబంధించిన 900 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు ఈ సర్వేలో పాల్గొన్నారు.

## ఏపీలో కూడా టికెట్లను పెంపుదల చేయొద్దు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ తరహాలో ఏపీలో కూడా టికెట్ల ధరల పెంపునకు, బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వద్దని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. పెద్ద హీరోల సినిమాలకు టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచడం పరిపాటిగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ప్రేక్షకుల జేబులు కొల్లగొట్టడమేనని అభిప్రాయపడ్డారు. అందుకే టికెట్ ధరలను పెంచడం, బెనిఫిట్ షోలకు అనుమతించే విధానాలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి కె.రామకృష్ణ ఓ లేఖ రాశారు. పెద్ద హీరోల సినిమాలకు టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినిస్తూ జీవోలు జారీ చేడయం పరిపాటిగా మారిందని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఇది ప్రేక్షకుల జేబులను కొల్లగొట్టడమే అని అభిప్రాయపడ్డారు. పెద్ద హీరోల సినిమాలను కొన్ని నిర్మాణ సంస్థలు పోటీపడి వందల కోట్ల రూపాయల భారీ బడ్జెట్లతో, ఏళ్ల తరబడి చిత్రీకరిస్తున్నాయని అన్నారు. కనీస సామాజిక స్పృహలేని ఆయా సినిమాల కలెక్షన్ల కోసం టికెట్ ధరలను పెంచాల్సిందిగా, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినివ్వాల్సిందిగా నిర్మాణ సంస్థలు ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నాయని పేర్కొన్నారు. సినిమా రంగానికి తలొగ్గి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా టికెట్ల ధరలను విపరీతంగా పెంచుకునేందుకు, బెనిఫిట్ షోలు వేసేందుకు అనుమతించాయని చెప్పారు. ఈ విధానాలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోవడంపై రామకృష్ణ విచారం వ్యక్తం చేశారు.

# భరతజాతి గర్వించదగ్గ నేత అటల్ బిహారీ వాజ్‌పేయి

### వాజ్‌పేయికి నివాళి అర్పించిన ఏపీ సీఎం



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** భరత జాతి గర్వించదగిన నేత భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి సందర్భంగా ఆయనకు సీఎం చంద్రబాబు ఘననివాళులు అర్పించారు. ఢిల్లీలోని 'సదైవ్ అటల్' స్మారక చిహ్నం వద్ద మాజీ ప్రధానికి ఘటన నివాళులు అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ కర్, ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అటల్ బిహారీ వాజ్ పేయిని ప్రశంసిస్తూ ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి పనిచేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. దేశానికి వాజ్ పేయి చేసిన సేవలు స్మరించుకున్నారు. గతంలో ఆయనతో దిగిన ఫొటోను షేర్ చేశారు. "భారతజాతి గర్వించదగిన నేత, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి సందర్భంగా ఘననివాళులు అర్పిస్తున్నా. దేశగతిని మార్చిన వాజ్ పేయి దూరదృష్టి కారణంగానే నేడు ప్రపంచ దేశాలతో భారత్ పోటీ పడుతోంది. అన్ని రంగాల్లో వృద్ధి సాధిస్తూ సగర్వంగా తలెత్తుకు నిలబడుతోంది. 'నేషన్ ఫస్ట్' అని ఎప్పుడూ భావించే ఆయనతో కలిసి పనిచేసిన అనుభూతి నాకు చిరకాలం గుర్తుండిపోతుంది. దేశం గురించి ఆయన ఆలోచించే తీరు విలక్షణమైనది. దానికి ఆధునికత, సాంకేతికత జోడించాలని సూచించినప్పుడు, సంస్కరణల గురించి ప్రతిపాదనలు చేసినప్పుడు ఆయన స్పందించిన తీరు నేను ఎన్నటికీ మరచిపోలేను. రాజనీతిజ్ఞులు, ప్రాత:స్మరణీయులు భారతదేశ ముద్దుబిడ్డ అటల్ జీకి ఘన నివాళి అర్పిస్తున్నా" అంటూ ట్వీట్ చేశారు.

## భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** భవానీ దీక్షల విరమణ చివరి రోజు కావడంతో విజయవాడలోని ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. బుధవారం తెల్లవారుజాము నుంచే భవానీ భక్తులు కృష్ణానది ఒడ్డున స్నానం ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్ని క్యూలైన్‌లల్లో ఆలయ అధికారులు భక్తులకు ఉచిత దర్శనం కల్పించారు. క్యూలో నిలుచున్న భక్తులకు 2 నుంచి 3 గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు వివరించారు. అమ్మవారి దర్శనం అనంతరం భవానీ ఘాట్, పున్నమి ఘాట్, సీతమ్మవారి పాదాల సమీపంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక కేశఖండన శాల వద్ద దీక్షాదారులు తలనీలాలు సమర్పించుకున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా నుంచి భవానీలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. భవానీ దీక్షాదారులు వయసుతో తారతమ్యం లేకుండా ఏడు కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ చేశారు. భవానీలతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. ఆలయ ఈవో రామారావుతో పాటు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, సంబంధిత శాఖల అధికారులు సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి భక్తుల రద్దీ, దర్శనాలు, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 21న ప్రారంభమైన దీక్షల విరమణ బుధవారంనాటితో ముగుస్తుంది.

# చదువుకున్న మహిళలకు వర్క్‌ఫ్రమ్ హోమ్

### గ్రామీణ, జిల్లా స్థాయిలో ఉత్పాదకత పెంచే లక్ష్యం

### వర్క్ ఫ్రం హోమ్, కో-వర్కింగ్ సెంటర్‌లతో మహిళలకు అవకాశం

### గృహిణులుగా మిగిలి పోకుండా మహిళలకు ఉపాధి అవకాశాలు

### సమీక్షలో చంద్రబాబు కీలక నిర్ణయం



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** గ్రామీణ, జిల్లా స్థాయిలో ఉత్పాదకత పెంచడం, వ్యాపార, ఉపాధి అవకాశాలు పెంచడం కోసం కొన్ని ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ఇందులో భాగంగా ఒకే చోట కలిసి పని చేసే విధానాన్ని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. రాష్ట్రంలో కో-వర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్కింగ్ స్పేస్ అభివృద్ధిపై ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనుంది. కో వర్కింగ్‌కు సంబంధించి సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో ఉన్న వారికి ట్రైనింగ్ ఇచ్చి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, అలాంటి వారి కోసం వర్కింగ్ స్పేస్ క్రియేట్ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. చదువుకున్న మహిళలు గృహిణులుగా మిగిలిపోకూడదని, వారికి అవకాశాలు కల్పించాలని సీఎం అభిప్రాయపడ్డారు. వర్క్ ఫ్రం హోమ్, కో-వర్కింగ్ సెంటర్‌లతో మహిళలకు విస్తృతంగా అవకాశాలు లభిస్తాయి. మహిళలను ఇంటికి, ఇంటి పనికి పరిమితం చేయడం సరికాదని సీఎం అన్నారు. ఇప్పటికీ చదువుకున్న మహిళలు ఇళ్లల్లో ఉంటున్నారని.. వారికి వర్క్ ఫ్రం హోమ్ అందుబాటులోకి తెస్తే ఆన్‌లైన్ విధానంలో పనిచేసి ఉపాధి పొందుతారని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల్లో ఎంతో సమర్థత, నైపుణ్యం ఉందని, కుటుంబ వ్యవహారాలు, బాధ్యత కారణంగా చాలా మంది ఇళ్లకే పరిమితం అవుతున్నారన్నారు. ఇలాంటి వారికి అవకాశాలు కల్పిస్తే ఎకనమిక్ యాక్టివిటీ పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. కో-వర్కింగ్ స్పేస్ సెంటర్ల ఏర్పాటులో 2025 డిసెంబర్ చివరినాటికి 1.50 సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. ఒక్కో సీటుకు 50-60 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరమని.. ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో ఈ వర్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ప్రైవేటు, ప్రభుత్వ భవనాల్లో 22 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎంతమంది వర్క్ ఫ్రం హోమ్‌లో పనిచేస్తున్నారు, వారి అవసరాలు ఏమిటనే సమాచారం సేకరించాలని అధికారులకు సీఎం సూచించారు. అదే విధంగా ఇప్పటికే నిర్ణయించినట్లు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు రాష్ట్రంలో 5 చోట్ల భవనాలను గుర్తించాలని సీఎం ఆదేశించారు.




## అటల్ బిహారీ వాజ్‌పేయి నాణెన్ని విడుదల చేసిన ప్రధాని మోదీ

### వాజ్‌పేయికి ఘన నివాళులర్పించిన రాష్ట్రపతి, ప్రధాని ప్రముఖులు

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** దివంగత ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయీ 100వ జయంతి ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక నాణేన్ని విడుదల చేశారు. వాజ్‌పేయీ వందవ జయంతి సందర్భంగా రూ.100 స్మారక నాణేన్ని రిలీజ్ చేశారు. అంతేకాకుండా స్టాంప్‌ను కూడా మోదీ విడుదల చేశారు. మరోవైపు వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా ఇవాళ ఢిల్లీలోని సదైవ్ అటల్ స్మారకం వద్ద నేతలు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కడ్, స్పీకర్ ఓం బిర్లా , ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, హెచ్‌డీ కుమార స్వామి ఇతర కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఏపీ సీఎం చంద్రబాబు సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, బీజేపీ నేతలు వాజ్‌పేయికి నివాళి అర్పించారు.

## కావాలనే బీజేపీ కుట్రలు చేస్తుంది : అతిషి

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** కావాలనే బీజేపీ కుట్రలు చేస్తుందని, పత్రికల్లో వచ్చిన పబ్లిక్ నోటీసులు తప్పుడువని, అదంతా బీజేపీ కుట్ర అని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి అన్నారు. ఆప్ ప్రభుత్వాన్ని బ్లేమ్ చేయడం కోసం బీజేపీ నేతలు కొంతమంది అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ పబ్లిక్ నోటీస్‌లు వచ్చేలా చేశారని ఆమె ఆరోపించారు. మహిళా సమ్మాన్ యోజన, వృద్ధులకు ఉచిత వైద్యం అందించే సంజీవని యోజన పథకాలను నోటిఫై చేయలేదని ఇవాళ ఢిల్లీ ప్రభుత్వం పబ్లిక్ నోటీస్ రిలీజ్ చేసింది. ఆ నోటీస్ ఢిల్లీలోని అన్ని ప్రధాన పత్రికల్లో అచ్చయ్యింది. దాంతో ఎన్నికల్లో ఓట్ల కోసం హామీలు ఇచ్చిన కేజ్రీవాల్.. ఇప్పుడు వాటిని తుంగలో తొక్కుతున్నారని, మహిళా సమ్మాన్ యోజన పథకాన్ని నోటిఫై చేయలేదని ఆప్ సర్కారు పబ్లిక్ నోటీస్ ఇవ్వడం ద్వారా ప్రజలకు ఇచ్చిన మాట తప్పిందని బీజేపీ నేతలు విమర్శించారు.

## బీజేపీ పార్టీ నేతల బుర్రలు పనిచేయడం లేదు : రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్



**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** భారతీయ జనతా పార్టీపై ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీకి పిచ్చిపట్టిందని, ఆ పార్టీ నేతల బుర్రలు పనిచేయడం లేదని ఫైరయ్యారు. 'మహిళా సమ్మాన్ యోజన ' పథకం అమలులో లేదని, ఇకముందు కూడా అమలు చేయబోవడం లేదని ఢిల్లీకి చెందిన మహిళాశిశు సంక్షేమ శాఖ మంగళవారం ఒక పబ్లిక్ నోటీస్‌ను విడుదల చేసింది. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పిస్తుండటంతో సంజయ్ సింగ్ స్పందించారు. బీజేపీ ఒక అబద్ధాలకోరు పార్టీ అని, ఆ పార్టీ పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆప్ నేత మండిపడ్డారు. బీజేపీ నేతల ఒత్తిడికి తలొగ్గి, ప్రభుత్వాన్ని బదనాం చేసేలా పబ్లిక్ నోటీస్ విడుదల చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఢిల్లీ ప్రజలు బీజేపీ నేతల తప్పుడు ప్రచారాలను నమ్మబోరని చెప్పారు. కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, బీజేపీ మాత్రం కేంద్రంలో ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు. 'బీజేపీకి పిచ్చిపట్టింది. బీజేపీ నేతల మెదళ్లు పనిచేయడంలేదు. బీజేపీ నేతల ఒత్తడికి తలొగ్గి తప్పుడు పబ్లిక్ నోటీస్ రిలీజ్ చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. కేజ్రీవాల్ ఢిల్లీ సీఎంగా.. ఉచిత విద్యుత్, ఉచిత తాగునీరు, ఉచిత విద్య, ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చారు. కేజ్రీవాల్ ఇచ్చిన హామీ మేరకు మహిళా సమ్మాన్ యోజన పథకం కూడా అమల్లోకి వస్తుంది. ఈ పథకం కేవలం హామీ కాదు. ఒక గ్యారంటీ' అని చెప్పారు. 'భారతీయ ఝూటా పార్టీ (బీజేపీని ఉద్దేశించి) ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చింది. విదేశీ బ్యాంకుల్లో ఉన్న బ్లాక్ మనీని బయటికి తీసుకొస్తామని చెప్పింది. రెండు కోట్ల ఉద్యోగ నియామకాలు చేపడుతామని ప్రచారం చేసింది. ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమచేస్తామని తెలిపింది. కానీ వాటిలో ఏ ఒక్క హామీని కూడా బీజేపీ నెరవేర్చలేదు.

# పార్శిల్‌లో డెడ్‌బాడీ కేసును ఛేదించిన పోలీసులు

### అమాయకుడిని హత్య చేసిన నిందితుడు

### అన్ని కోణాల్లో కేసు పరిశీలిస్తున్న పోలీసులు





**పశ్చిమగోదావరి, (క్రైమ్ మిర్రర్):** ఏపీలో డెబ్‌బాడీ పార్శిల్ కేసు అనేక మలుపులు తిరుగుతూ తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. మొదట్లో సాగి తులిసి అనే మహిళ ఇంటికి డెడ్‌బాడీ పార్శిల్ రావడం తీవ్ర కలకలం రేపగా.. అసలు ఈ డెడ్ బాడీ ఎవరిది?.. ఎవరు హత్య చేశారు? అనేదానిపై పోలీసులు లోతైన విచారణ జరిపారు. చివరకు డెడ్ బాడీ ఎవరిదో గుర్తించారు. అలాగే నిందితుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే డెడ్ బాడీ గురించి పోలీసులు చేపట్టిన విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పనికోసం వచ్చిన వాడిని హతమార్చడాన్ని ఎవరూ జీర్ణించుకోలేని పరిస్థితి. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో సాగి తలసి అనే మహిళ ఇంటికి పార్శిల్ వచ్చింది. దాన్ని తెరిచి చూడా అందులో ఉన్నదాన్ని చూసి సదరు మహిళ షాక్‌కు గురైంది. పార్శిల్‌గా డెడ్‌బాడీ రావడంతో మహిళ పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు డెడ్‌బాడీని స్వాధీనం చేసుకున్నారు. అలాగే మృతదేహాన్ని గుర్తించడంలోనూ పోలీసులు పురోగతి సాధించారు. పార్శిల్‌గా వచ్చిన డెడ్‌బాడీ కాళ్ల గ్రామానికి చెందిన పర్లయ్యదిగా గుర్తించారు. అలాగే పర్లయ్యను హత్య చేసింది తులసి సోదరి భర్త శ్రీధర్ వర్మగా నిర్ధారించారు. ఈ క్రమంలో శ్రీధర వర్మ కోసం తీవ్రంగా గాలించిన పోలీసులు చివరకు అతడిని పట్టుకుని రహస్యంగా విచారణ చేపట్టారు. అయితే నిందుతుడు శ్రీధర్ వర్మ గురించి విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి. శ్రీధర్ వర్మకు మూడు పేర్లు, ముగ్గురు భార్యలు ఉన్నట్లు తెలిసింది. శ్రీధర్ వర్మ రెండో భార్య అక్క సాగి తులసితో ఆస్థి వ్యవహారానికి సంబంధించి గొడవు నడుస్తున్నాయని.. ఈ క్రమంలో ఆమెను బెదరించడానికి పక్కా స్కెచ్‌తో పర్లయ్యను హత్య చేసి పార్శిల్‌గా పంపించినట్లు బయటపడింది. అయితే హత్య విషయంలోనూ నిందుతుడు ముందగానే పెద్ద ప్లాన్ వేసుకున్నాడు. ఇందులో భాగంగా రెండు శవపేటికలను తయారు చేయించాడు. అలాగే రోజు వారీ కూలీలైన పర్లయ్య, రాజులను పని ఇప్పిస్తానంటూ తీసుకెళ్లాడు. ముందుగా అనుకున్న ప్రకారం వారిలో ఒకరిని చంపి పార్శిల్ చేయాలని భావించాడు. అయితే రాజుకు కుటుంబసభ్యులు ఉన్నందును అతడిని చంపితే గొడవలు అవుతాయని భావించిన శ్రీధర్ వర్మ.. పర్లయ్యను చంపాలని నిర్ణయించుకున్నాడు. పర్లయ్యకు కుటుంబసభ్యుల ఉన్నా వారు పట్టించుకోరని భావించిన శ్రీధర్.. అనుకున్న ప్రకారం పర్లయ్యను హతమార్చాడు. ఇదంతా మూడో భార్య ఇంట్లోనే జరిగినట్లు తెలుస్తోంది. మూడో భార్య ఇంట్లో పర్లయ్యను హత్య చేసి ఆపై తాను ముందు సిద్ధం చేసిపెట్టుకున్న శవపేటికలో మృతదేహాన్ని ఉంచాడు. స్వయంగా శ్రీధర్ వర్మనే కారులో పార్శిల్‌ను తీసుకెళ్లి తులసి ఇంట్లో పెట్టి.. ఓపెన్ చేసి పరారైనట్లు స్థానికులు చెబుతున్న మాట. అయితే ఈ మొత్తం వ్యహారంలో శ్రీధర్ వర్మ మూడో భార్య ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు పర్లయ్య మృతిపై కాళ్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివాదరహితుడిగా ఉన్న పర్లయ్యను ఇంత దారుణంగా హత్య చేయడంతో వారు తట్టుకోలేకపోతున్నారు. అమాయకుడిని అన్యాయంగా చంపేశారని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అలాగే మూడో భార్య ఇంట్లో మరో శవపేటికను కూడా పోలీసులు గుర్తించారు. అసలు ఇంకో శవపేటికను శ్రీధర్ వర్మ ఎందుకు తీసుకువచ్చాడనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అలాగే నిందితుడి ఇంట్లో పోలీసులు సెర్చ్ చేయగా చేతబడి చేసే సామాగ్రి కూడా లభించడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు శ్రీధర్ వర్మ వృత్తి ఏంటి అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముఖ్యంగా తులసిని ఆస్తి కోసమే బెదిరించడానికి ఎలాంటి సంబంధం లేని పర్లయ్యను ఎందుకు హత్య చేశాడు అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అలాగే ఒకరిని హత్య చేయాలని భావించిన శ్రీధర్ వర్మ.. రెండు శవ పేటికలను ఎందుకు తయారు చేయించాడు? శ్రీధర్ వర్మ టార్గెట్ మరొకరు ఉన్నారా? కేవలం తులసిని బెదిరించడానికే ఇంత స్కెచ్ వేశాడా? లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు పోలీసుల విచారణకు శ్రీధర్ వర్మ సహకరించడం లేదని.. పోలీసులు వేస్తున్న ప్రశ్నలకు శ్రీధర్ వర్మ సరైన సమాధానాలు చెప్పడం లేదని తెలుస్తోంది. మొత్తానికి డెడ్ బాడీ పార్శిల్ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. ఇందులో ఎవరెవరు ఉన్నారనే దానిపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.

# పాకిస్తాన్ x దక్షిణాఫ్రికా

## నేటి నుంచి తొలి టెస్టు

**మధ్యాహ్నం గం. 1:30 నుంచి జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం**



సెంచూరియన్: దక్షిణాఫ్రికా గడ్డపై తొలిసారి వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించిన పాకిస్తాన్ జట్టు నేటి నుంచి టెస్టు సిరీస్ ఆడనుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా పాకిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య గురువారం నుంచి తొలి టెస్టు ప్రారంభం కానుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో 63.33 పాయింట్లతో ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా... ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఈ సిరీస్‌ను 2%-%0తో గెలవాల్సిన అవసరముంది. ఇదే తమ లక్ష్యమని సఫారీ జట్టు సారథి తెంబా బవుమా ఇప్పటికే ప్రకటించగా... వన్డే సిరీస్‌లో కనబర్చిన జోరును కొనసాగిస్తూ సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ సత్తా చాటాలని పాకిస్తాన్ జట్టు ఆశిస్తోంది. పేసర్లకు సహకరించనున్న సెంచూరియన్ పిచ్‌పై దక్షిణాఫ్రికా నలుగురు పేసర్లతో బరిలోకి దిగనుంది. గత ఆరేళ్లలో సెంచూరియన్‌లో జరిగిన మ్యాచ్‌ల్లో పేసర్లు 227 వికెట్లు పడగొట్టగా... స్పిన్నర్లు కేవలం 16 వికెట్లు మాత్రమే తీశారు. సఫారీ గడ్డపై పాకిస్తాన్ టెస్టు రికార్డు ఏమంత గొప్పగా లేదు. 1995 నుంచి అక్కడ పర్యటిస్తున్న పాక్ జట్టు 15 టెస్టులాడి 12 మ్యాచ్‌ల్లో ఓడింది. పాకిస్తాన్ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరు (49) కూడా దక్షిణాఫ్రికా గడ్డపైనే నమోదైంది. వన్డే సిరీస్‌లో సత్తా చాటిన ప్రధాన పేసర్ షాహీన్ షా అఫ్రిది లేకపోవడం పాక్ జట్టుకు ప్రధాన లోటు కాగా... చివరగా ఇంగ్లండ్‌తో ఆడిన టెస్టు మ్యాచ్‌లో చోటు దక్కించుకోలేకపోయిన నసీమ్ షా, బాబర్ ఆజమ్ తిరిగి జట్టులోకి వచ్చారు. పేస్ బౌలర్ మొహమ్మద్ అబ్బాస్ మూడేళ్ల తర్వాత పాక్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. మరి టెస్టుల్లో నిలకడైన ప్రదర్శన కనబర్చలేకపోతున్న పాకిస్తాన్ జట్టు షాన్ మసూద్ సారథ్యంలో సఫారీ గడ్డపై పేస్ సవాల్‌ను ఎలా ఎదుర్కొంటుదనేది ఆసక్తికరం.



## కాంబ్లీకి 5 లక్షల ఆర్థిక సాయం

ముంబై: మూత్రనాళాల సమస్యతో బాధపడుతూ భీవండిలోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్న భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీకి మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే రూ. 5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. కళ్యాణ్ లోక్‌సభ నుంచి ఎంపీగా ఉన్న ఆయన.. డాక్టర్ శ్రీకాంత్ షిండే ఫౌండేషన్ ద్వారా ఈ సాయం అందజేస్తామని తెలిపారు.కాగా యూరినరీ ఇన్‌ఫెక్షన్ తగ్గినప్పటికీ కాంబ్లీ జ్వరంతో బాధపడుతున్నాడు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో అతడి మెదడును స్కానింగ్ చేయాలని వైద్యులు భావించినప్పటికీ జ్వరం కారణంగా అది సాధ్యపడలేదని డాక్టర్ వివేక్ త్రివేది తెలిపారు.

## నేటి నుంచే పీకేఎల్ ప్లేఆఫ్స్



పూణె: గత కొద్దిరోజులుగా క్రీడాభిమానులను అలరిస్తున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) ముగింపు దశకు చేరుకుంది. లీగ్ దశలో రాణించి పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన హర్యానా స్టీలర్స్, దబాంగ్ ఢిల్లీ (ఈ రెండు జట్లు నేరుగా సెమీస్ చేరాయి), యూపీ యోధాస్, పాట్నా పైరేట్స్, యూ ముంబా, జైపూర్ పింక్ పాంథర్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయి.గురువారం యూపీ.. తొలి ఎలిమినేటర్‌లో జైపూర్‌తో తలపడనుండగా రెండో ఎలిమినేటర్‌లో పాట్నా.. ముంబైని ఢీకొననుంది. ఎలిమినేటర్ విజేతలు శుక్రవారం (డిసెంబర్ 27) హర్యానా, ఢిల్లీతో తలపడతారు. ఈనెల 29న ఫైనల్ జరుగనుంది.

## దేశవాళీ టోర్నీలు పెంచాలి

**అప్పుడే భారత్‌లో టెన్నిస్‌కు మరింత ఆదరణ**

**డబుల్స్ దిగ్గజం బోపన్న మనోగతం**

టెన్నిస్ క్రీడకు మరింత ఆదరణ లభించాలంటే... దేశవాళీ టోర్నీలు విరివిగా నిర్వహించాలని భారత టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న అభిప్రాయపడ్డాడు. టెన్నిస్ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్న 44 ఏళ్ల బోపన్న... భారత్‌లో టెన్నిస్ భవిష్యత్తు, యువ ఆటగాళ్ల ముందున్న సవాళ్లు, తన సహచరుడు మాథ్యూ ఎబ్డెన్‌తో విడిపోయి కొత్త భాగస్వామితో కలిసి ఆడనుండటం తదితర అంశాలపై స్పష్టత ఇచ్చాడు.

# బాక్సింగ్ పంచ్ ఎవరిదో?..

**నేటి నుంచే భారత్, ఆసీస్ నాలుగో టెస్టు**


**ఉదయం 5 గం. నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో లైవ్**

**జోరుమీదున్న కంగారూలు**

**దశాబ్దకాలంగా మెల్‌బోర్న్‌లో ఓటమెరుగని టీమ్‌ఇండియా**

**రోహిత్ సేనను వేధిస్తున్న బ్యాటింగ్ కష్టాలు**

**డబ్ల్యూటీసీ ఫైనల్‌కు కీలకం!**





భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కీలక టెస్టుకు నేడు తెరలేవనుంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇరు జట్లూ తలా ఓ మ్యాచ్ నెగ్గగా ఓ టెస్టు డ్రా గా ముగిడయంతో గురువారం నుంచి మొదలుకాబోయే 'బాక్సింగ్ డే' టెస్టుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరగాల్సి ఉన్న ఈ మ్యాచ్‌లో గెలుపుపై ఇరు జట్లూ ధీమాతో ఉన్నాయి. ఎంసీజీలో గెలిచి సిరీస్‌ను దక్కించుకునేందుకు కంగారూలు ప్రణాళికలు రచిస్తుండగా దశాబ్ద కాలంగా ఇక్కడ ఆడిన మూడు టెస్టులలోనూ ఓటమన్నదే లేని టీమ్‌ఇండియా.. అదే ఫీట్‌ను రిపీట్ చేయాలని భావిస్తోంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తును దక్కించుకోవాలని చూస్తున్న భారత్‌కు మెల్‌బోర్న్‌లో గెలవడం అత్యంత కీలకం.

మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య గురువారం నుంచి ప్రఖ్యాత మెల్‌బోర్న్ స్టేడియం వేదికగా నాలుగో టెస్టు మొదలుకానుంది. మూడు మ్యాచ్‌లు ముగిసిన ఈ సిరీస్‌లో ఇరు జట్లూ తలా ఓ టెస్టు నెగ్గి (మూడో టెస్టు డ్రా) సిరీస్‌లో 1-1తో సమంగా ఉన్న నేపథ్యంలో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో గెలిచిన జట్టు సిరీస్‌ను దక్కించుకునే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఆతిథ్య ఆస్ట్రేలియా కంటే ఈ మ్యాచ్‌లో గెలవడం రోహిత్ సేనకు అత్యంత ఆవశ్యకం. ఎంసీజీలో గెలిస్తే సిరీస్‌ను నిలబెట్టుకోవడంతో పాటు వచ్చే ఏడాది లార్డ్స్ వేదికగా జరగాల్సి ఉన్న వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో బెర్తును ఖాయం చేసుకునే అవకాశాలూ భారత్‌కు మరింత మెరుగవుతాయి. కాగా ఎంసీజీ పిచ్ బంతితో పాటు బ్యాట్‌కూ అనుకూలించే అవకాశం ఉండటంతో ఇరు జట్ల మధ్య హోరాహోరి పోరు ఖాయంగా కనిపిస్తోంది.

**పర్యాటక జట్టుకు బ్యాటింగ్ కష్టాలు**

ఈ సిరీస్‌లో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో జైస్వాల్, రాహుల్, కోహ్లీ ప్రదర్శనలను మినహాయిస్తే భారత బ్యాటర్లు వరుసగా విఫలమవుతున్నారు. అడిలైడ్‌లో దారుణ ఓటమికి బ్యాటింగ్ వైఫల్యమే కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. గబ్బాలో రాహుల్, జడేజా ఫర్వాలేదనిపించగా మిగిలినవారు కాడి వదిలేశారు. రాహుల్ ఓపెనర్‌గా రాణిస్తుండటంతో అతడి స్థానాన్ని వెనక్కి జరిపే సాహసం చేయలేక కెప్టెన్ రోహిత్ శర్మ మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వస్తున్నా రెండు టెస్టులలోనూ (3,6,10) అతడు కనీసం రెండంకెల స్కోరు చేయడానికే తంటాలు పడ్డాడు.మెల్‌బోర్న్‌లో హిట్‌మ్యాన్ ఓపెనర్‌గా వస్తాడని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే రాహుల్ మూడో స్థానంలో, గిల్ మిడిలార్డర్‌లో ఆడే చాన్స్ ఉంది. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ మినహా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సైతం విఫల ప్రదర్శన భారత్‌ను వేధిస్తోంది. ఆఫ్‌సైడ్ ఆవల బంతులను వెంటాడి బలవుతున్న కోహ్లీ బలహీనత బ్రిస్బేన్ (7,11)లోనూ కొనసాగింది. మెల్‌బోర్న్‌లో మంచి రికార్డు కలిగిన విరాట్.. తనకు ఎంతో ఇష్టమైన ఎంసీజీలో అయినా బ్యాట్ ఝుళిపించాలని అభిమానులు ఆశిస్తున్నారు. గిల్, పంత్ మెల్‌బోర్న్‌లో సత్తా చాటాలని భారత్ భావిస్తోంది.

**కూర్పుపై తర్జన భర్జన**

నాలుగో టెస్టులో తుది కూర్పుపైనా భారత్ తర్జనభర్జన పడుతోంది. సిరీస్‌లో ఆసీస్‌కు కళ్లెం వేస్తున్న పేసు గుర్రం బుమ్రాకు అండగా నిలిచే బౌలర్ లేకపోవడం టీమ్‌ఇండియాను దెబ్బతీస్తోంది. సిరాజ్ వికెట్ల వేటలో వెనుకబడుతున్నాడు. మూడో టెస్టు ఆడిన ఆకాశ్ దీప్ కూడా ఆకట్టుకునే ప్రదర్శన చేయలేదు. అయితే ఎంసీజీ పిచ్ నాలుగో రోజు నుంచి స్పిన్నర్లకు అనుకూలించే అవకాశాలుండటంతో ఈ మ్యాచ్‌లో ఇద్దరు స్పెషలిస్టు స్పిన్నర్లతో భారత్ బరిలోకి దిగొచ్చని సమాచారం. జడ్డూకు తోడుగా వాషింగ్టన్‌ను ఆడించేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రచిస్తోంది. అదే జరిగితే తుది జట్టు నుంచి నితీశ్ రెడ్డిని తప్పించే అవకాశముంది. కానీ గత మూడు టెస్టులలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న నితీశ్‌పై వేటు వేస్తారా? అన్నది ఆసక్తికరం.

**అతడిని ఆపితేనే..**

భారత్ మాదిరిగానే ఆసీస్‌నూ బ్యాటింగ్ కష్టాలు వేధిస్తున్నా రెండు జట్లకు తేడా ట్రావిస్ హెడ్ ప్రదర్శనలే. టీమ్‌ఇండియా అంటేనే ఎక్కడలేని ఉత్సాహంతో చెలరేగే హెడ్ మెల్‌బోర్న్‌లోనూ అదే సీన్ రిపీట్ చేస్తే మ్యాచ్‌పై ఆశలు వదిలేసుకోవాల్సిందే. ఈ సిరీస్‌లో ఇప్పటికే అతడు 89, 140, 152తో భీకర ఫామ్‌లో ఉన్నాడు. స్టీవ్ స్మిత్ కూడా గబ్బా టెస్టులో సెంచరీతో ఫామ్‌లోకి వచ్చాడు. ఖవాజా, లబూషేన్, మార్ష్ ఆశించిన స్థాయిలో రాణిస్తే భారత్‌కు తిప్పలు తప్పవు. హెడ్‌తో పాటు వీరిని అడ్డుకోవడానికి భారత్ ప్రత్యేక ప్రణాళికలతో బరిలోకి దిగాలి. ఈ మ్యాచ్‌లో ఆసీస్.. ఓపెనర్ మెక్‌స్వీనే స్థానంలో సామ్ కొన్‌స్టాస్‌ను ఆడిస్తోంది. పేస్ త్రయం స్టార్క్, కమిన్స్, బొలాండ్‌కు తోడుగా ఈ మ్యాచ్‌లో స్పిన్నర్ నాథన్ లియాన్ భారత బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేసేందుకు సిద్ధమవుతున్నాడు.2014 నుంచి మెల్‌బోర్న్‌లో భారత్ టెస్టు ఓడలేదు. 2018-19, 2020-21లో టీమ్‌ఇండియాదే విజయం.

ఇప్పటిదాకా ఆసీస్ 43 బాక్సింగ్ డే టెస్టులు ఆడితే అందులో 26 గెలిచింది. భారత్‌తో 9 ఆడి ఐదింటిలో నెగ్గింది.

తుది జట్లు

భారత్ (అంచనా): యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, రోహిత్ శర్మ (కెప్టెన్), రవీంద్ర జడేజా, నితీశ్ రెడ్డి/వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్

**ఆస్ట్రేలియా:** ఉస్మాన్ ఖవాజా, సామ్ కొన్‌స్టాస్, మార్నస్ లబూషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, అలెక్స్ కేరీ, పాట్ కమిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, స్కాట్ బొలాండ్

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.